మానేరు
# జనత®
తెలుగు దినపత్రిక | ఇది జనం గొంతుక

11.03.2025
మంగళవారం Tuesday
సంపుటి (Volume): 09
సంచిక (Issue) : 327
పేజీలు : 8
Pages : 8
Published from : Karimnagar

సమస్య ఏదైనా
జనం కోసం జనతా..
ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ,ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..

ఔత్సాహికులు..
సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989867251
- ఎడిటర్

## ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్..
వ్యూస్‌లోనూ రికార్డులు బద్దలు



07

# ప్రాజెక్టులకు బడ్జెట్‌లో పరిమిత నిధులు
## అందుకే కేంద్రం సాయం కోరుతున్నాం

- మోడీ ఇచ్చిన హామీ మేరకు నిధులు అడుగుతన్నం
- 39సార్లు కాకుంటే 99 సార్లు ఢిల్లీ వెళతాం
- అవసరమైతే ఢిల్లీలో ధర్నాకైనా వెనకాడం
- మూసీకి నిధులు తెస్తే కిషన్‌రెడ్డికి సన్మానం
- మీడియా చిట్‌చాట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి



తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి మీడియాతో చిట్‌చాట్‌లో సంచలన వ్యాఖ్యలు చేశారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై విమర్శలతో దాడి చేశారు. కేసీఆర్‌ను ఓడించి.. సీఎం కుర్చీలో నుంచి దింపింది తానే అన్నారు రేవంత్. ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు గుండు సున్నా వచ్చిందంటే కారణం తానేనని కేటీఆర్ గుర్తించాలని చెప్పారు రేవంత్‌రెడ్డి. స్టేటస్ గురించి కేటీఆర్ మాట్లాడుతున్నారు.. అసలు కేటీఆర్ ఎవరు? ఎక్కడి నుంచి వచ్చారు? అని ప్రశ్నించారు. అధికారం పోయిందనే అక్కసుతో కేటీఆర్ మాట్లాడుతున్నారు. కేసీఆర్‌ది అసెంబ్లీకి వచ్చే స్థాయి కాదన్నారు రేవంత్.

**హైదరాబాద్, జనతా న్యూస్:** ప్రాజెక్టులకు బడ్జెట్‌లో పరిమితమైన కేటాయింపులు ఉంటాయని.. అందుకే కేంద్ర ప్రభుత్వాన్ని నిధులు అడుగుతున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. గతంలో ప్రధాని మోదీ ఇచ్చిన హా మీ మేరకే నిధులు ఇవ్వాలని కోరుతున్నట్లు సీఎం చెప్పారు. 39 సార్లు కాకుంటే 99 సా ర్లు ఢిల్లీ పోతాం.. తప్పేంటని సీఎం ప్రశ్నించారు. సందర్భం వస్తే నిధుల విషయంలో ఢిల్లీలోనైనా ధర్నా చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. సీఎల్పీలో సీఎం మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. 'మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్

మిగతా 2 లో

## 12 నుంచి అసెంబ్లీ సమావేశాలు



03

## అసెంబ్లీ సమావేశాలకు కేసీఆర్ వస్తారు

- గవర్నర్ ప్రసంగం రోజు.. బడ్జెట్ రోజు హాజరవుతారు
- బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




## ఫోన్‌ట్యాపింగ్ కేసు తీర్పు వాయిదా

- రాధాకిషన్ రావు ముందస్తు బెయిల్ పిటిషన్‌పై ముగిసినవాదనలు 02

## పీజీ మెడికల్ రిజర్వేషన్లపై పిల్ కొట్టివేత
తీర్పు వెలువరించిన సుప్రీంకోర్టు



02



## ప్రణయ్ కేసులో ఒకరికి ఉరి

- ఆరుగురికి జీవిత ఖైదు
- మిర్యాలగూడ పరువు హత్య కేసులో
- నల్లగొండ కోర్టు సంచలన తీర్పు

4

## చర్చ జరగాల్సిందే..

- ఓటింగ్ అక్రమాలపై రాహుల్ పట్టు..
- హిందీ, డీలిమిటేషన్ అంశాలపై దద్దరిల్లిన పార్లమెంట్

పార్లమెంట్ బడ్జెట్ సెషన్స్ లో ప్రభుత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి విపక్షాలు. ఓటింగ్ అక్రమాలు, హిందీ, డీలిమిటేషన్, మణిపూర్ అల్లర్లపై విపక్షాలు ప్రభుత్వాన్ని ఊపిరాడకుండా చేశాయి. ఒకవైపు కాంగ్రెస్, మరోవైపు డీఎంకే, తృణమూల్ తదితర పార్టీలు వివిధ అంశాలపై గొంతెత్తడంతో సమావేశాలు వాయిదాల పర్వం అందుకున్నాయి. సోమవారం (మార్చి 10) సమావేశాలు ప్రారంభం కాగానే డీఎంకే సభ్యులు నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీపై పట్టుబట్టారు. హిందీని బలవంతంగా రుద్దడంపై ఉభయసభలను స్తంభింపజేశారు.



02

## నేను ఎవరి సింపతీ మీద రాజకీయాల్లోకి రాలేదు

- రాజకీయంగా ఫైట్ చేస్తా
- త్వరలో సినిమాల్లో కూడా నటిస్తున్నా
- తన షాక్‌కు కాలం సమాధానం
- కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి





## ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్లు

- నేడు నామినేషన్ల పరిశీలన.. 13న ఉపసంహరణ
- తెలుగు రాష్ట్రాల్లో 10 స్థానాలకు..
- పోటీ లేక ఏకగ్రీవం అయ్యే అవకాశం

రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు నామినేషన్ల గడువు సోమవారంతో పూ-ర్తయ్యింది. తెలంగాణలో 5 స్థానాలకు, ఏపీలో 5 స్థానాలకు గానూ ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు మార్చి 2న నోటిఫికేషన్ విడుదలైంది. తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సంఖ్యాబలమ ఆధారంగా కాంగ్రెస్ కు 4 స్థానాలు దక్కగా.. బీఆర్ఎస్ కు ఒక స్థానం దక్కింది. అయితే పొత్తులో భాగంగా తమ 4 స్థానాల్లో ఒకదానిని సీపీఐకి కేటాయిస్తున్నట్టు కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయం తీసుకుంది. కాంగ్రెస్ తరపున విజయశాంతి, అద్దంకి దయాకర్, కేతావత్ శంకర్ నాయక్ బరిలో ఉండగా.. వీరి మిత్రపక్షం సీపీఐ తరపున నెల్లికంటి సత్యం పేరును ఖరారు చేసింది.

4

## కేంద్రీయ విద్యాలయాల్లో ఎంపీ కోటా

- పునరుద్ధరించేది లేదన్న కేంద్ర మంత్రి



02

## రాజకీయ నేతల భూకబ్జాలు

- హైడ్రా కమిషనర్‌కు ప్రజల ఫిర్యాదులు

02

# పీజీ మెడికల్ రిజర్వేషన్లపై పిల్ కొట్టివేత

## తీర్పు వెలువరించిన సుప్రీంకోర్టు



**హైదరాబాద్, మార్చి 10:** మెడికల్ విద్యకు సంబంధించి పోస్టు గ్రాడ్యుయేట్ మెడికల్ కోర్సుల్లో ప్రవేశాల కోసం తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన తెలంగాణ మెడికల్ కాలేజెస్ (అడ్మిషన్ ఇన్‌టు పోస్ట్‌గ్రాడ్యుయేట్ మెడికల్ కోర్సులు) రూల్స్ 2017లోని కొన్ని నిబంధనలను సవాల్ చేస్తూ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ వి ఈశ్వరయ్య దాఖలుచేసిన పిల్‌ను సుప్రీంకోర్టు కొట్టేసింది. ఈ పిల్‌ను విచారించిన జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ ఆగస్టిన్ జార్జ్ మ-సీహ్‌లతోకూడిన ధర్మాసనం ఈ మేరకు తీర్పు వెలువరించింది. విచారణ సందర్భంగా ధర్మాసనం వ్యాఖ్యానిస్తూ.. 'పిటిషనర్ ఉద్దేశం మంచిదే అనడంలో ఎలాంటి సందేహం లేదని పేర్కొంది. అయితే కోర్టు నిర్ణయాలతో తీవ్రంగా ప్రభావితమయ్యే ఇతర అభ్యర్థుల వాదనలు వినకుండా ఇలాంటి విషయాలపై నిర్ణయం తీసుకోలేమని స్పష్టం చేసింది. ఆల్ ఇండియా బ్యాక్‌వర్డ్ క్లాసెస్ ఫెడరేషన్ అధ్యక్షుడి హోదాలో జస్టిస్ ఈశ్వరయ్య ఈ పిల్ వేసినట్లు సమాచారం. పీజీ మెడికల్ అడ్మిషన్లలో మెరిట్ ఆధారంగా సీట్లు పొందిన రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులను ఓపెన్ కేటగిరీలో సీట్లు పొందడానికి అనుమతించకుండా రిజర్వ్‌డ్ కేటగిరీలో ఎంచుకోవాలని నిబంధన విధించారు. దీంతో రిజర్వ్‌డ్ కేటగిరీలో సీట్లు తగ్గిపోతున్నాయని, ఈ నిబంధనను మార్చాలని ఆయన సుప్రీంకోర్టును కోరారు. ఈ అంశాన్ని పరిశీలించిన ధర్మాసనం ఇందులో విభిన్న సంక్లిష్టమైన అంశాలు ఉన్నాయని, ఎవరైనా బాధితులు వ్యక్తిగతంగా కోరితే కోర్టు ఆ విషయాలను పరిగణనలోకి తీసుకోవాలని ధర్మాసనం స్పష్టం చేసింది. తెలంగాణ రాష్ట్రంలో టీజీఎడ్‌సెట్ 2025 నోటిఫికేషన్ విడుదలైంది. జూన్ 1వ తేదీన రెండు సెషన్లలో ఆన్‌లైన్ విధానంలో ఎడ్ సెట్ పరీక్ష నిర్వహించనున్నట్లు కన్వీనర్ వెంకట్రాంరెడ్డి తెలిపారు. హనుమకొండలోని కాకతీయ విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో సెట్ ఛైర్మన్, కేయూ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఆన్‌లైన్ దరఖాస్తులు మార్చి 12 నుంచి మే 13వ తేదీ వరకు స్వీకరిస్తారు. రూ 250 అపరాధ రుసుంతో మే 20 వరకు, రూ.500 అపరాధ రుసుంతో మే 24 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

# ఫోన్‌ట్యాపింగ్ కేసు తీర్పు వాయిదా

**హైదరాబాద్, మార్చి 10 :** ఫోన్ ట్యాపింగ్ కేసుపై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. ముందస్తు బెయిల్ కోరుతూ రాధాకిషన్ రావు దాఖలు చేసిన పిటిషన్‌పై వాదనలు ముగిశాయి. తీర్పును కోర్టు వాయిదా వేసింది. గతంలో చక్రధర్‌గౌడ్ ఫిర్యాదుతో ఫోన్ ట్యాపింగ్ కేసు నమోదు అయిన విషయం తెలిసిందే. ఫోన్ ట్యాపింగ్‌పై పంజాగుట్టలో నమోదైన రెండో ఎఫ్ఐఆర్‌పై ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని రాధాకిషన్ రావు వేసిన పిటిషన్‌పైన సుదీర్ఘ వాదనల తర్వాత ఈరోజు వాదనలు ముగిశాయి. తీర్పును న్యాయస్థానం వాయిదా వేసింది. చక్రధర్‌గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాధాకిషన్‌రావుతో పాటు మాజీ మంత్రి హరీష్ రావు సహా పలువురిపై కేసు నమోదు అయ్యింది. ఈ కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ రాధాకిషన్ రావు తన వాదనలు వినిపించారు. కానీ ముందస్తు బెయిల్ ఇవ్వొద్దంటూ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలు వినిపించారు. ఈ కేసులో విచారణ జరపాలని, చాలా ఆధారాలను సేకరించాల్సి ఉంటుందని, కీలక అంశాలు వెలుగులోకి రావాలని ఈ క్రమంలో రాధాకిషన్‌కు బెయిల్ ఇవ్వొద్దని పబ్లిక్ ప్రాసిక్యూటర్ తన వాదనలు వినిపించారు. ఇరు వాదనలు విన్న కోర్టు తీర్పును వాయిదా వేసింది. ఇప్పటికే ఫోన్ ట్యాపింగ్ కేసు మొదటి ఎఫ్ఐఆర్‌లో జ్యుడిషియల్ రిమాండ్ నుంచి కొద్దిరోజుల క్రితమే రాధాకిషన్ బెయిల్‌పై బయటకు వచ్చారు. దీంతో రెండో కేసుకు సంబంధించి తనకు బెయిల్ ఇవ్వాలంటూ హైకోర్టును ఆశ్రయించారు. వాదనలు పూర్తి కాగా.. న్యాయస్థానం తీర్పు ఎలా ఉండబోతంది అనే ఉత్కంఠ సర్వత్రా నెలకొంది.

# గ్రూప్-1 ఫలితాలు విడుదల

**హైదరాబాద్,మార్చి10:** ఎట్టకేలకు తెలంగాణ గ్రూప్-1 పరీక్షల ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. మెయిన్స్ పరీక్షల ప్రొవిజనల్ మార్కులను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ విడుదల చేసింది. టీఎస్‌పీఎస్సీ అధికారిక వెబ్‌సైట్‌లో అభ్యర్థులు లాగిన్ వివరాలతో మార్కులు చూసుకోవచ్చని పేర్కొంది. 563 పోస్టుల భర్తీ కోసం టీఎస్‌పీఎస్సీ పరీక్షలు నిర్వహించిన విషయం తెలిసిందే. గతేడాది అక్టోబర్ చివరివారంలో గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు జరగ్గా.. 21,093 మంది అభ్యర్థులు హాజరయ్యారు.

# ఆశ్రమ పాఠశాలలో విద్యార్థిని మృతి

**ఆదిలాబాద్, మార్చి 10:** ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. బజార్ హత్నూర్ మండలంలోని మోర్కండి గ్రామానికి చెందిన రాజేశ్వర్ కూతురు లాలిత్య చక్రం 9వ తరగతి చదువుతున్నది. ఆదివారం రాత్రి తోటి విద్యార్థులతో కలిసి భోజనం చేసి నిద్రపోయింది. ఉదయం విద్యార్థులంతా నిద్రలేచినప్పటికీ ఆమె.. మేల్కొనకపోవడంతో ఉపాధ్యాయులకు సమాచారం అందించారు. దీంతో విగతజీవిగా మారిన లాలిత్యను చూసిన ఉపాధ్యాయులు పోలీసులు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న సీఐ భీమేష్ వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బోథ్ దవాఖానకు తరలించారు. కాగా, లాలిత్య కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారని ఉపాధ్యాయులు తెలిపారు. అయితే అనారోగ్యంపై పాఠశాల సిబ్బంది తమకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉన్నది.

# కళ్లంలోని మిర్చి దహనం

## సుమారు 11 లక్షల రూపాయల నష్టం

**కొత్తగూడెం, మార్చి 10 :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం వెంకట్రావుపేటలో కళ్లంలో ఆరబెట్టిన మిర్చిని తగలబెట్టారు గుర్తుతెలియని దుండగులు. ఈ ఘటనలో సుమారు 70 క్వింటాల మిర్చి దగ్ధమైనట్లు రైతు పురుషోత్తం చెప్తున్నారు. ఇది ఎవరు చేశారో.. ఎందుకు చేశారో తెలియదని, ఆరుగాలం కష్టపడి పండించిన పంట అగ్నికి ఆహుతి అయిందని రైతు పురుషోత్తం కన్నీటి పర్యంతం అవుతున్నారు. ప్రస్తుతం మార్కెట్ ధర ప్రకారం.. సుమారు 11 లక్షల రూపాయల నష్టం వాటిల్లినట్లు రైతు తెలిపారు. ఘటన జరిగిన వెంటనే అక్కడికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలు అదుపులోకి తెచ్చారు. భారీగా మిర్చి దగ్ధం అవడంతో ఆ ఘాటుకి ఊర్లో జనం కొన్ని గంటల పాటు అతలాకుతులమయ్యారు. దేశానికి అన్నం పెట్టే రైతును ఇలా చేయడం ఏంటి..ఎవరు చేశారో ఆ దుండగులను కఠినంగా శిక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

# ప్రాజెక్టులకు బడ్జెట్‌లో పరిమిత నిధులు

మొదటి పేజీ తరువాయి



భయపెడతారనే ప్రభుత్వానికి బిజెపి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సహకరించడంలేదని సిఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. మనోహర్ లాల్ ఖట్టర్ వచ్చేది కూడా కిషన్ రెడ్డికి తెలియదా? అని ప్రశ్నించారు. ఆర్‌ఆర్‌ఆర్ ఇచ్చామని మోదీ అన్నారని, అదే ఇవ్వమంటున్నామని రేవంత్ అన్నారు. 'జైపాల్ రెడ్డి తెచ్చిన మెట్రో కనిపిస్తోంది..కిషన్ రెడ్డి తెచ్చిన మెట్రో ఎక్కడనిధ్వజమెత్తారు. ప్రాజెక్టులు ముందుకెళ్లకుండా అడ్డుకుంటోంది బిజెపి ఎంపిలేనని మండిపడ్డారు. మూసీకి నిధులు తెస్తే కిషన్ రెడ్డికి సన్మానం చేస్తానని రేవంత్ సవాల్ చేశారు. అఖిల పక్ష సమావేశానికి పిలిస్తే కిషన్ రెడ్డి రాలేదని ఆరోపించారు. తెలంగాణకు కావాల్సిన అనేక అంశాలను క్లియర్ చేసుకుని వచ్చానని, కులగణన ప్రభావం వల్లే అన్ని పార్టీలు బిసిలకు టికెట్లు ఇచ్చాయన్నారు. మెట్రో తెచ్చానన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డినే నిధులు అడుగుతున్నాం. ఎన్‌హెచ్ భూసేకరణకు అడ్డుపడుతున్నది ఈటల రాజేందర్ కాదా? భూసేకరణ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిది అని అన్నప్పుడు మాతో కదా చర్చించాలి. కేంద్ర మంత్రులు హైదరాబాద్ వచ్చి సమీక్షలు పెడితే కిషన్ రెడ్డి ఎందుకు రాలేదు. కేసీఆర్ బాధపడుతారని కిషన్‌రెడ్డి రాలేదా? పట్టణాభివృద్ధి శాఖ మంత్రి సమీక్ష పెడితే ఎందుకు రా లేదు? ఇతర రాష్ట్రాలకు ఇచ్చిన ప్రాజెక్టులు తెలంగాణకు ఎందుకు ఇవ్వలేదు. హైదరాబాద్ అభివృద్ధిని ఇతర ప్రాంతాలకు విస్తరించాలని మేం భావిస్తున్నాం. రాష్ట్రానికి నిధులు రాకూడదని భారాస చూస్తోంది. రాష్ట్రాభివృద్ధి, కేంద్ర నిధులపై చర్చకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సిద్ధం కావాలి. చర్చకు నేను, భట్టి విక్రమార్క రావడానికి సిద్ధంగా ఉన్నాం. అధిక నిధులు ఇచ్చినట్లు నిరూపిస్తే కిషన్‌రెడ్డికి సన్మానం చేస్తాం అని అన్నారు. భారాస హ యాంలో పదేళ్లలో ప్రాజెక్టులు కట్టిఉంటే.. ఇప్పుడు ఏపీతో సమస్య వచ్చేది కాదు. మందకృష్ణ మాదిగ అంటే నాకు గౌరవం ఉంది. పోటీ పరీక్షల ఫలితాలకు.. రిజ ర్వేషన్లకు ఎలాంటి సంబంధం లేదు. మందకృష్ణ భాజపా నేతలా మాట్లాడితే ఎలా? గతంలో ఎప్పుడో వచ్చిన నోటిఫికేషన్లకు ఎస్సీ వర్గకరణ అంశం వర్తించదు. ఏదైె నా చేయాలని చూస్తే న్యాయపరమైన చిక్కులు వస్తాయి. పార్టీ మారిన ఎమ్మెల్యేలు ఏం మాట్లాడుతున్నారో నాకు తెలియదు. కేటీఆర్, కిషన్‌రెడ్డి కలిసి తిరుగుతున్నారని నేను చెబుతున్నా' అని సీఎం పేర్కొన్నారు. అఖిల పక్ష సమావేశానికి పిలిస్తే కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సికింద్రాబాద్‌లో ఉండి కూడా రాలేదని.. కేసీఆర్ బాధపడుతారని కేంద్రమంత్రి సహకరించడం లేదని రేవంత్ రెడ్డి అన్నారు. సబర్మతి, యమునా, గంగా ప్రక్షాళనకు నిధులు ఇస్తున్న కేంద్రం మూసీకి ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. కుల గణన ప్రభావమే అన్ని పార్టీలు బీసీలకు టికెట్లు ఇచ్చాయన్నారు. హరీష్ రావు మోసం వల్లే గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో ఓడిపోయామని విమర్శించారు.'నేను రాష్ట్ర ముఖ్యమంత్రిని. కేసీఆర్‌ను ఓడించింది నేను. కేసీఆర్‌ను గుండుసున్నా చేసింది నేను. కేసీఆర్‌ను బండకేసి కొట్టింది నేను. అడ్డగోలుగా మాట్లాడడంలో కేసీఆర్‌కు మించినవాళ్ళ ఎవరున్నారు.కేటీఆర్ స్థాయి ఏంటి. కేసీఆర్‌కు బలుపు తప్ప ఏముంది. తండ్రీ కొడుకులకు బలుపు తప్పా ఏముంది.అసెంబ్లీలో అధికారపక్షం కంటే ప్రతిపక్షానికి ఎక్కువ సమయం ఇస్తున్నాం' అని ముఖ్యమంత్రి అన్నారు. ప్రతిపక్షం లేని రాజకీయాలు చేయాలని తాము అనుకోవడం లేదన్నారు. వాళ్ళు మూసేసిన ధర్నా చౌక్ మేం తెరిచామన్నారు. విమర్శలు చేస్తే పరిశీలించుకుంటామని.. సలహాలు ఇస్తే తప్పకుండా స్వీకరిస్తామని వెల్లడించారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వీలైనంత త్వరగా పూర్తి చేస్తామన్నారు. జీతభత్యాలు తీసుకొని పని చేయని వ్యక్తి కేసీఆర్ అని అన్నారు.

# చర్చ జరగాల్సిందే..

## ఓటింగ్ అక్రమాలపై రాహుల్ పట్టు..

### హిందీ, డీలిమిటేషన్ అంశాలపై దద్దరిల్లిన పార్లమెంట్



**న్యూ ఢిల్లీ:** పార్లమెంట్ బడ్జెట్ సెషన్స్ లో ప్రభుత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి విపక్షాలు. ఓటింగ్ అక్రమాలు, హిందీ, డీలిమిటేషన్, మణిపూర్ అల్లర్లపై విపక్షాలు ప్రభుత్వాన్ని ఊపిరాడకుండా చేశాయి. ఒకవైపు కాంగ్రెస్, మరోవైపు డీఎంకే, తృణమూల్ తదితర పార్టీలు వివిధ అంశాలపై గొంతెత్తడంతో సమావేశాలు వాయిదాల పర్వం అందుకున్నాయి. సోమవారం (మార్చి 10) సమావేశాలు ప్రారంభం కాగానే డీఎంకే సభ్యులు నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీపై పట్టుబట్టారు. హిందీని బలవంతంగా రుద్దడంపై ఉభయసభలను స్తంభింపజేశారు. దీంతో సభ మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు స్పీకర్ ఓం బిర్లా. వాయిదా తర్వాత విపక్ష సభ్యుల ఆందోళనల మధ్య సభ తిరిగి ప్రారంభమయ్యింది. లోక్ సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ ఇటీవల జరిగిన ఎన్నికలలో ఓటింగ్ అవకతవకలపై గళమెత్తారు. ఓటింగ్ లో అక్రమాలు జరిగాయని, దేశవ్యాప్తంగా దీనిపై సందేహాలు ఉన్నాయనే అంశాన్ని లేవనెత్తారు. "ఓటింగ్ లో అక్రమాలు జరిగాయనే ఆందోళన అన్ని పార్టీలలో ఉంది. విపక్ష పార్టీలన్నీ ఈ అంశంపై చర్చ జరగాలని కోరుకుంటున్నాయి. ఈ అంశంపై చర్చ పెట్టాల్సిందే" నని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దీంతో కాంగ్రెస్ తో పాటు ఇతర పార్టీల సభ్యులు చర్చ జరగాల్సిందేనని పట్టుబట్టారు. ఇక రాజ్యసభలో డీఎంకే సభ్యులు జాతీయ విద్యా విధానంపై చర్చ జరపాలని పట్టుబట్టారు. డీలిమిటేషన్ అంశంపై ఆందోళకు దిగారు. దీనిపై ఎడ్యుకేషన్ మినిస్టర్ ధర్మేంద్ర ప్రధాన్.. విద్యార్థుల భవిష్యత్తుతో రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ క్రమంలో డీఎంకే ఎంపీలకు, ధర్మేంద్ర ప్రదాన్ కు మధ్య వాగ్వాదం చెలరేగింది. "డీఎంకే సభ్యులకు విద్యార్థుల భవిష్యత్ పై శ్రద్ధ లేదు. విద్యార్థుల జీవితాలతో రాజకీయం చేస్తున్నారు. ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారు"అని మండిపడ్డారు. కేంద్ర మంత్రి వ్యాఖ్యలకు నిరసనగా ఆందోళనకు దిగారు డీఎంకే ఎంపీలు. విపక్ష ఎంపీల ఆందోళనపై రాజ్యసభ వ్యవహారాల మంత్రి జేపీ నడ్డా ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఓటింగ్ వ్యవహారంపై చర్చకు పట్టుబట్టడం పార్లమెంటును అవమానించినట్లేనని అన్నారు. అదే విధంగా జాతీయ విద్యావిధానంపై డీఎంకే వ్యవహరిస్తున్న తీరు సరైనది కాదని అన్నారు. సభ్యులకు సమస్యలపై చర్చించే ఉద్దేశం లేదని, కేవలం ఆందోళనతో సభలను గందరగోళానికి గురిచేయాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో రాజ్యసభ నుంచి విపక్షాలు వాక్ అవుట్ చేశాయి. ఇటీవల ప్రవేశ పెట్టిన బడ్జెట్ పై చర్చతో పాటు వక్ఫ్ బోర్డ్ సవరణ బిల్లు తదితర కీలక బిల్లులకు ఆమోదం కోసం ప్రభుత్వం ప్రయత్నిస్తున్న తరుణంలో విపక్ష సభ్యుల ఆందోళనతో ఉభయ సభల్లో గందరగోళం నెలకొంది.

# కేంద్రీయ విద్యాలయాల్లో ఎంపీ కోటా

## పునరుద్ధరించేది లేదన్న కేంద్రమంత్రి

**న్యూఢిల్లీ, మార్చి 10 :** కేంద్రీయ విద్యాలయాల్లో ప్రవేశాలకు పార్లమెంటు సభ్యులకు గతంలో ఇచ్చిన కోటాను పునరుద్ధరించే ప్రతిపాదన లేదని కేంద్రం తేల్చి చెప్పింది. లోక్‌సభలో జేడీయూ ఎంపీ రాంప్రీత్ మండల్ అడిగిన ప్రశ్నకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తూ బదిలీ అయ్యే ఉద్యోగుల పిల్లల విద్యావసరాలను తీర్చేందుకు కేంద్రీయ విద్యాలయాలు ఏర్పాటయ్యాయి. వీటి ద్వారా దేశవ్యాప్తంగా ఒకేరకమైన విద్య అందుతుంది. అయితే, కేంద్రీయ విద్యాలయ సంఘటన్ ఈ ప్రవేశాల్లో ఉండే ఎంపీ కోటా సహా పలు ప్రత్యేక ప్రొవిజన్లను గతంలో ఉపసంహరించుకుంది. ఈ ప్రత్యేక కోటాలు తరగతి గది సంఖ్యకు మించి ఉండటంతో విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తి అధికంగా ఉండేది. అందువల్ల తరగతి గదిలో విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తి ఆరోగ్యకరంగా ఉండేలా చూడటం, వ్యవస్థలో గుణాత్మక మార్పు తీసుకురావాలన్న జాతీయ విద్యా విధానం లక్ష్యానికి అనుగుణంగా ఉత్తమ అభ్యాసన ఫలితాలు సాధించేందుకు ఈ కోటాలను తొలగించారు. ప్రస్తుతం ఈ కోటాను పునరుద్ధరించే ప్రతిపాదన ఏదీ కేంద్రం వద్ద లేదు' అని విద్యాశాఖ మంత్రి పేర్కొన్నారు. కేంద్రీయ విద్యాలయాల్లో ప్రవేశాలకు విద్యార్థులను సిఫార్సు చేసే పలు ప్రత్యేక కోటాలను కేంద్రం 2022 ఏప్రిల్‌లో రద్దు చేసింది.

# రాజకీయ నేతల భూకబ్జాలు

## హైడ్రా కమిషనర్‌కు ప్రజల ఫిర్యాదులు

**హైదరాబాద్, మార్చి 10 :** అధికారాన్ని అడ్డుపెట్టుకొని మాజీ మున్సిపల్ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, వార్డు మెంబర్లు కబ్జాలకు పాల్పడుతున్నారని, వారిపై ఫిర్యాదు చేసినా స్థానిక అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు హైడ్రా కమిషనర్ రంగనాథ్ దృష్టికి తీసుకొచ్చారు. పాసు పుస్తకాలను సృష్టించి పాత లేఅవుట్లను చెరిపేసి పంట పొలాలుగా సాగు చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. సోమవారం హైడ్రా నిర్వహించిన ప్రజావాణిలో నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు.. లేఅవుట్లలో రహదారుల కబ్జాలు, పార్కుల ఆక్రమణలపై ఫిర్యాదులు చేశారు. మొత్తం 63 ఫిర్యాదులు అందుకున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్.. తుర్కయంజాల్, ప్రతాపసింగారం, బోడుప్పల్ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిశీలించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# పన్నులు తగ్గించాలని కోరకండి

## పారిశ్రామ వర్గాలకు నితిన్ గడ్కరీ సూచన

**న్యూఢిల్లీ,మార్చి10:** జీఎస్టీ, ఇతర పన్నులు తగ్గించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయొద్దని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ పరిశ్రమ వర్గాలకు సూచించారు. పేదల కోసం సంక్షేమ పథకాలను అమలు చేయడానికి ప్రభుత్వానికి నిధులు అవసరం అన్నారు. కాబట్టి..జీఎస్టీ, ఇతర పన్నులు తగ్గించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయొద్దని కోరారు. ఒకవేళ పన్నులు తగ్గిస్తే.. మరింత తగ్గించాలని కోరతారని, ఇది మనుషుల మనస్తత్వమని ఆయన వ్యాఖ్యానించారు. తాము కూడా పన్నులు తగ్గించడానికి అనేక ప్రయత్నాలు చేస్తున్నామని..కానీ దాని వల్ల ప్రజలకు సంక్షేమ పథకాలను అందించడం సాధ్యం కాదని పేర్కొన్నారు. ధనవంతుల నుంచి పన్నులు వసూలు చేసి..పేదల అవసరాలకు వినియోగించడం ప్రభుత్వ దార్శనికత అని మంత్రి అన్నారు. దేశంలో లాజిస్టిక్స్ ఖర్చు రెండేళ్లలోపు 9 శాతానికి తగ్గుతుందని పరిశ్రమ వర్గాలకు మంత్రి హామీ ఇచ్చారు. చైనాలో లాజిస్టిక్స్ ఖర్చు 8 శాతం ఉండగా.. యూఎస్, ఐరోపా దేశాల్లో 12 శాతం ఉందని తెలిపారు. మూలధన పెట్టుబడులను పెంచడం ద్వారా భవిష్యత్తులో దేశంలో మరిన్ని ఉద్యోగాలను సృష్టించవచ్చన్నారు. భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చడానికి దిగుమతులను తగ్గించి ఎగుమతులను పెంచాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

# 1.95 లక్షల కోట్ల పన్ను ఎగవేత

**న్యూఢిల్లీ,మార్చి10 :** ఈ ఆర్థిక సంవత్సరానికి గాను జనవరి నెల వరకు రూ.1.95 లక్షల కోట్ల పన్ను ఎగవేతలు గుర్తించామని ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి సోమవారం లోక్ సభలో వెల్లడించారు. ఈ ఆర్థిక సంవత్సరానికి గాను జనవరి వరకు.. 25,397 పన్ను ఎగవేత కేసులు నమోదయ్యాయని తెలిపారు మంత్రి. గత ఐదు సంవత్సరాలలో కేంద్ర ప్రభుత్వ అధికారులు గుర్తించిన మొత్తం జీఎస్టీ ఎగవేత కేసుల సంఖ్య 86,711గా ఉందని.. వీటి మొత్తం విలువ రూ.6.79 లక్షల కోట్లకు పైగా ఉందని మంత్రి తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో జనవరి వరకు, నమోదైన ఎగవేత కేసుల సంఖ్య 25,397 కాగా.. మొత్తం విలువ రూ.1,94,938 కోట్లుగా ఉందని మంత్రి తెలిపారు. అదే సమయంలో, పన్ను ఎగవేత కేసులలో రూ.21,520 కోట్ల వాలంటరీ డిపాజిట్ అయ్యిందని తెలిపారు. 2024 - 25 ఆర్థిక సంవత్సరంలో మొత్తం ఐటీసీ మోసాల కేసులు 13,018 కాగా.. వీటి మొత్తం విలువ రూ.46,472 కోట్లుగా ఉందని తెలుస్తోంది. వీటిలో రూ.2,211 కోట్ల వాలంటరీ డిపాజిట్ జరిగిందని తెలిపారు మంత్రి పంకజ్ చౌదరి. జీఎస్టీ ఇన్వెస్టిగేషన్ వింగ్ డేటా ప్రకారం, 2023-24 ఆర్థిక సంవత్సరంలో, 20,582 ఎగవేత కేసులు నమోదు కాగా.. వీటి మొత్తం విలువ రూ.2.30 లక్షల కోట్లు అని తెలుస్తోంది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో జీఎస్టీ ఎగవేత విలువ రూ. 1.32 లక్షల కోట్లు కాగా.. 2021-22లో రూ. 73,238 కోట్లు, 2020-21లో రూ. 49,384 కోట్లు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో జీఎస్టీ పన్ను ఎగవేతలు నివారించడానికి కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి పంకజ్ చౌదరి అన్నారు.

# 12 నుంచి అసెంబ్లీ సమావేశాలు

## తొలిరోజు గవర్నర్ ప్రసంగం : సిఎస్ శాంతికుమారి

**హైదరాబాద్, మార్చి 10:** ఈ నెల 12 నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. తొలిరోజు ఉభయ సభల సభ్యులను ఉద్దేశించి గవర్నర్ జిజష్టుదేవ్ వర్మ ప్రసంగిస్తారు. 13న గవర్నర్ ప్రసంగంపై చర్చ ఉంటుంది. 14న హోలీ సెలవు కారణంగా అసెంబ్లీకి కూడా సెలవు. 15న గవర్ర్ ప్రసంగానికి సిఎం రేవంత్ సమాధానం ఇస్తారు. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న సందర్భంగా రాష్ట్ర శాసన సభ, శాసన మండలి సమావేశాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సోమవారం డా.బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో అధికారులతో సమీక్షిస్తూ, గౌరవ శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, లేవనెత్తిన అన్ని ప్రశ్నలకు త్వరితగతిన పూర్తి సమాచారంతో సమాధానాలు పంపాలని, అసెంబ్లీ అధికారులతో సమన్వయం చేసుకోవాలని సి.ఎస్ అధికారులకు సూచించారు. బ్జడెట్ సెషన్‌లో సరైన సమాచారం అందించేందుకు సంబంధిత కార్యదర్శులు తప్పనిసరిగా హాజరు కావాలని, శాఖల వారీగా నోడల్ అధికారులను కూడా నియమించుకోవాలని సి.ఎస్ అన్నారు. తదుపరి రోజుల్లో వివిధ శాఖల డిమాండ్లపై చర్చ జరగనున్నందున, వివిధ శాఖల వారీగా పూర్తి వివరాలతో అధికారులు సన్నద్ధం కావాలని సి.ఎస్ పేర్కొన్నారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు వికాస్ రాజ్, జయేష్ రంజన్, రవి గుప్తా, ముఖ్య కార్యదర్శులు సందీప్‌కుమార్ సుల్తానియా, శైలజా రామయ్యర్, సంజయ్ కుమార్, దాన కిషోర్, శ్రీధర్, ఎస్.ఎ.యం. రిజ్వీ, కార్యదర్శులు యోగితా రాణా, లోకేష్ కుమార్, క్రిస్టినా జెడ్ చోంగ్తు, బుద్ధ ప్రకాష్ జ్యోతి, రఘునందన్ రావు, అనితా రామచంద్రన్, ఇతర అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

# ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్లు



- నేడు నామినేషన్ల పరిశీలన.. 13న ఉపసంహరణ
- రెండు తెలుగు రాష్ట్రాల్లో పది స్థానాలకు పోటీ
- పోటీ లేకపోవడంతో ఏకగ్రీవం అయ్యే అవకాశం

**హైదరాబాద్/అమరావతి,మార్చి10 :** రెండు తెలుగు రాష్ట్రాల్లో మార్చి 20న ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ క్రమంలో ఆయా పార్టీలు ఎమ్మెల్సీ స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థులు సోమవారం నామినేషన్లు దాఖలు చేశారు. స్వీకరణకు చివరి తేదీ కావడంతో ఆయా పార్టీ అభ్యర్థులు ఎమ్మెల్సీ స్థానాలకు నామినేషన్లు దాఖలు చేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను అందజేశారు. దీంతో నామినేషన్ల ప్రక్రియ పూర్తి అయ్యింది. తెలంగాణలోని 5, ఆంధ్రప్రదేశ్‌లోని 5 ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి. మంగళవారం నామినేషన్ల పరిశీలన జరుగనుంది. నామినేషన్లను పరిశీలించాక, ఈ నెల 13న నామినేషన్‌ల ఉపసంహరణకు చివరి తేదీ. అయితే విపక్షం నుంచి పోటీ లేనందున ఎన్నిక ఏకగ్రీవం అయ్యే అవకాశం ఉంది. తెలంగాణలో ఎమ్మెల్సీలు మహమూద్ అలీ, సత్యవతి రాథోడ్, శేరి సుభాష్ రెడ్డి, ఎగ్గె మల్లేశం, మీర్జా రియాజుల్ హసన్ పదవీకాలం మార్చి 29తో ముగియనుంది. ఇందులో బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికైన ఎ÷-గగె మల్లేశం గత ఏడాదే కాంగ్రెస్‌లో చేరారు. మీర్జా రియాజుల్ హాసన్ మజ్లిస్ నేత కాగా, మిగిలిన ముగ్గురు బీఆర్ఎస్ నేతలు. అటు ఏపీలో జంగా కృష్ణమూర్తి, దువ్వారపు రామారావు, బీటీ నాయుడు, అశోక్‌బాబు, యనమల రామకృష్ణుడుల పదవీకాలం ఈ నెల 29తో మ-ుగియనుంది. దీంతో తెలంగాణలో ఐదు, ఏపీలో ఐదు స్థానాలకు ఇప్పటికే నోటిషన్ విడుదలైంది. ఏపీలో ఐదు ఎమ్మెల్సీ స్థానాల్లో జనసేన తరపున నాగబాబు, టీడీపీ తరపున బీటీ నాయుడు, బీద రవిచంద్ర యాదవ్, కావలి గ్రీష్మ, బీజేపీ అభ్యర్థిగా సోము వీర్రాజు పేర్లను ఖరారు చేశారు. ఇప్పటికే నాగబాబు నామినేషన్ వేయగా.. మిగిలిన నలుగురు అభ్యర్థులు ఈరోజు అసెంబ్లీ కమిటీ హాలులో నామినేషన్ వేశారు. పొత్తులో భాగంగా ఐదు ఎమ్మెల్సీ స్థానాల్లో రెండింటిలో జనసేన, బీజేపీ అభ్యర్థులు బరిలో దిగారు. ఇక మిగిలిన మూడు స్థానాల్లో ఉత్తరాంధ్ర, కోస్తా, రాయలసీమ ప్రాంతాల నడుమ సమతూకం పాటిస్తూ చంద్రబాబు ఎమ్మెల్సీ అభ్యర్థులను ఖరారు చేశారు. మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో రెండింటిని బీసీలకు కేటాయించగా.. ఒక స్థానాన్ని ఎస్సీ మహిళకు ఇచ్చింది. తెలుగుదేశం తరపున ఎమ్మెల్సీలుగా కావలి గ్రీష్మ, బీదా రవిచంద్ర యాదవ్, బీటీ నాయుడు అసెంబ్లీ ఆవరణలో రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను అందజేశారు. అభ్యర్థులకు మద్దతుగా నారా లోకేష్, అచ్చెన్నాయుడు, కందుల దుర్గేష్, విష్ణుకుమార్ రాజు, రఘురామకృష్ణంరాజు, పితాని సత్యనారాయణ, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, పల్లా శ్రీనివాస్, టీడీ జనార్దన్, కురుగొండ్ల రామకృష్ణ, అమర్నాథ్ రెడ్డి తదితరులు వచ్చారు. అలాగే అసెంబ్లీ కమిటీ హాల్లో బీజేపీ అభ్యర్థి సోమివీర్రాజు నామినేషన్ దాఖలు చేశారు. తెలంగాణలో ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు గాను మూడు స్థానాల్లో కాంగ్రెస్ తమ అభ్యర్థుల పేర్లను ప్రకటించింది. ఎమ్మెల్సీ అభ్యర్థులుగా అద్దంకి దయాకర్, శంకర్ నాయక్, విజయశాంతి పేర్లు ఖరారయ్యాయి. పొత్తులో భాగంగా సీపీఐకి ఒక స్థానాన్ని కేటాయించింది. సీపీఐ తరఫున నెల్లికంటి సత్యాన్ని బరిలోకి దిగారు. వీరంతా నేడు ఎమ్మెల్సీ అభ్యర్థులుగా నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు, ఎమ్మెల్యేలు, సీపీఐ నేతలు హాజరయ్యారు. అలాగే బీఆర్ఎస్ తన అభ్యర్థిగా దాసోజు శ్రవణ్ కుమార్ పేరును ఖరారు చేయడంతో ఆయన నామినేషన్ వేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్‌రావు పాల్గొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నామినేషన్లను తిరస్కరించనున్నారు. 13న ముగియనున్న నామినేషన్ల ఉపసంహరణ గడువు మ-ుగియనుండగా.. ఆ తర్వాత అధికారికంగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఈసీ ప్రకటించనుంది.



## నేను ఎవరి సింపతీ మీద రాజకీయాల్లోకి రాలేదు

### రాజకీయంగా ఫైట్ చేస్తా

### త్వరలో సినిమాల్లో కూడా నటిస్తున్నా : జగ్గారెడ్డి



**హైదరాబాద్, మార్చి 10 :** తాను సింపతీ మీద రాజకీయాల్లోకి రాలేదని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి చెప్పుకొచ్చారు. సోమవారం ఢిల్లీలో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ... రాజకీయాల్లో ఫైట్ చేస్తానని.. త్వరలో సినిమాల్లోకి రానున్నట్లు ప్రకటించారు. అతి త్వరలో ఒక ప్రేమ కథ చిత్రంలో ప్రత్యేక పాత్ర పోషించనున్నట్లు ఆఫ్ ది రికార్డ్‌లో ఆయన వెల్లడించారు. సినిమాలో మాఫియాను ఎదురించి ఆడపిల్ల పెళ్ళి చేసే వ్యక్తి అతనే జగ్గారెడ్డి అని అన్నారు. ఈ మధ్య కాలంలో ఓ వ్యక్తి తన దగ్గరకు వచ్చి ఒక కథ ఉంది అని చెప్పారన్నారు. 'ఆ కథలో మీ పాత్ర ఉందని అన్నారు. ఆ సినిమాలో నటిస్తా అని చెప్పాను. ఈ కథలో నా ఒరిజినల్ క్యారక్టర్ కూడా ఉండబోతుంది. ఈ ఉగాదికి సినిమా కథ విని.. వచ్చే ఉగాదికి సినిమా పూర్తి చేస్తాం. పీసీసీ, సీఎం అనుమతి తీసుకొని నటిస్తాను' అని వెల్లడించారు. ఇక సినిమా పేరును కూడా ప్రకటించేశారు జగ్గారెడ్డి. అదే 'జగ్గారెడ్డి...వార్ ఆఫ్ లవ్' అనే టైటిల్‌ను ఖారారు చేసినట్లు తెలిపారు. ఇక రాజకీయ అంశాలపై మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపిక చూసి మైండ్ బ్లాక్ అయిందన్నారు. తాను రాజకీయంగా షాక్‌లో ఉన్నట్లు తెలిపారు. తన షాక్‌కు కాలం సమాధానం చెబుతుందన్నారు. కమ్మ సామాజిక వర్గానికి చెందిన నాయకుడు జట్టి కుసుము అని తెలిపారు. అనుకోకుండా ఢిల్లీకి తెలంగాణ నుంచి నేతలు రాలేదన్నారు. 2017లో రాహుల్ గాంధీ సంగారెడ్డి సభను తానే ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నాటి కష్టాలు పరిణామాలు చెప్పాలని అనుకున్నానని.. దానిపై రాహుల్ గాంధీని కలిసేందుకు ఢిల్లీకి వచ్చినట్లు వెల్లడించారు. రాహుల్ గాంధీని సమయం అడిగానని అన్నారు. కుసుమకు ఎమ్మెల్సీ ఇవ్వాలని పీసీసీ ప్రెసిడెంట్ మహేష్ కుమార్, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, డిప్యూటీసీఎ భట్టి విక్రమార్కకు చెప్పానన్నారు. తాను ఢిల్లీకి వచ్చి కుసుమ అంశం మాట్లాడాలని అనుకున్నానన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఈ అంశాన్ని ముందే చెప్పినట్లు తెలిపారు. తాను ఢిల్లీకి వచ్చినప్పుడు ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ,కేసీ వేణుగోపాల్ లేరని జగ్గారెడ్డి వెల్లడించారు.


## డీలిమిటేషన్‌పై డిఎంకె నిరసన

### పార్లమెంట్ ఆవరణలో ఆందోళన

**న్యూఢిల్లీ, మార్చి 10:** డీలిమిటేషన్ అంశంపై సోమవారం పార్లమెంట్ ఆవరణలో డిఎంకె నిరసన చేపట్టింది. డిఎంకె తిరుచ్చి శివ సహా పలువురు ఇతర పార్టీల ఎంపిలు ఈ నిరసనలో పాల్గొన్నారు. ఆందోళనలో భాగంగా తిరుచ్చి శివ మీడియాతో మాట్లాడారు. డీలిమిటేషన్ పక్రియకు బదులుగా ప్రత్యామ్నాయాన్ని చేపట్టాలని కేంద్రాన్ని అభ్యర్థించారు. డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలపై తీవ్ర ప్రభావం పడుతుందని మండిపడ్డారు.రాజ్యాంగం ప్రకారం.. జనాభా ఆధారంగా డీలిమిటేషన్ కసరత్తు 2026లో జరగనుందని అన్నారు. 42వ సవరణ మరియు 84వ సవరణల ప్రకారం.. జనాభా నియంత్రణ పురోగతిని పరిగణించాల్సి వున్నందున 25 సంవత్సరాల తర్వాత చేపట్టాలని నిర్ణయించారని అన్నారు. ఆ ప్రాతిపదికన డీలిమిటేషన్ జరిగితే.. తమిళనాడు సహా అన్ని దక్షిణాది రాష్ట్రాలు ప్రతికూలంగా ప్రభావితమవుతాయని పునరుద్ఘాటించారు. దీంతో కేంద్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాన్ని రూపొందించాలని అభ్యర్థిస్తున్నామని అన్నారు. జనాభా ఆధారంగా డీలిమిటేషన్ చేపడితే తమిళనాడు సహా పలు రాష్ట్రాలు చాలా సీట్లను కోల్పోవలసి వుంటుందని అన్నారు. తమిళనాడు 39 సీట్ల నుండి 31కి, కేరళ 20 నుండి 12కి పడిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. అయితే ఉత్తరాది రాష్ట్రాల్లో సీట్లు 30 నుండి 40కి పెరుగుతాయని, దీంతో పార్లమెంటులో దక్షిణాది రాష్ట్రాలు సమాన ప్రాతినిధ్యాన్ని కోల్పోతాయని అన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో ఓ పద్ధతి ఉంటుంది


### ఎప్పుడు ఎవరికైనా అవకాశం వస్తుంది: విజయశాంతి



**హైదరాబాద్,మార్చి10:** కాంగ్రెస్ పార్టీలో ఓ పద్ధతి ఉంటుందని, పనిచేసే వారికి ఎప్పుడో ఒకప్పుడు ఎవరికైనా అవకాశం వస్తుందని నటి విజయశాంతి అన్నారు. ఒక ఆలోచన.. ముందుచూపుతో రాష్ట్ర ప్రజల కోసం పలు సంక్షేమ పథకాలను కాంగ్రెస్ పార్టీ ప్రకటించిందని ఎమ్మెల్సీ అభ్యర్థి విజయశాంతి అన్నారు. ఇచ్చిన ప్రతి హామీని ఒక్కొక్కటిగా ప్రభుత్వం నెరవేర్చుతుందని అన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు.'నేను గతంలోనూ కాంగ్రెస్‌లో పనిచేశాను. కానీ, ఏనాడూ ఇది కావాలని పార్టీని అడగలేదు. పార్టీ హైకమాండ్ నాకు అవకాశం ఇచ్చినా.. నాకు వద్దు.. నేను ముందు పనిచేస్తా అని అన్నాను. గతంలో కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దింపడమే లక్ష్యంగా పనిచేశాం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆహ్వానం మేరకు తిరిగి కాంగ్రెస్‌లోకి వచ్చాను. పార్టీ హైకమాండ్ ఎప్పుడు ఏ నిర్ణయం తీసుకుంటుందో ఎవరికీ తెలియదు. ఎవరికి ఏ బాధ్యత ఇవ్వాలనుకుంటుందో అదే ఇస్తుంది. పార్టీలో ఉన్నవారందరూ కాస్త ఓపిక పట్టాలి. పార్టీ నాకు ఎప్పుడు బాధ్యతలు అప్పగిస్తుందో.. అప్పుడే మాట్లాడాలి.. పని చేయాలి అని అనుకున్నాను. అవకాశం కోసం ఎదురు చూశాను. కాంగ్రెస్ పార్టీలో ఒక సిస్టమ్ ఉంది. అది మీరకుండా ప్రతిఒక్కరూ పనిచేయాల్సి ఉంటుంది. ప్రజల సమస్యలకు పరిష్కారం చూపించే దిశగా పోరాడుతాం' అని అన్నారు.

## రేవంత్‌రెడ్డికి ఢిల్లీలో ఏం నడుస్తలేదు

- ఆయన వల్లే కోవర్డుల టాపిక్ తెచ్చిన రాహుల్
- గతంలోనే దాసోజుకు ఎమ్మెల్సీ ఇద్దామనుకున్నాం.. బీజేపీ అడ్డుకుంది : కేటీఆర్



**హైదరాబాద్, మార్చి 10:** రేవంత్‌రెడ్డికి ఢిల్లీలో పని పోయిందని.. అక్కడ ఎవరూ రేవంత్‌రెడ్డిని ఖాతరు చేయడం లేదని.. ఆయన గురించి తెలిసినందువల్లే రాహుల్‌గాంధీ కోవర్టుల టాపిక్ తీసుకొచ్చారని మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా దాసోజు శ్రవణ్ సోమవారం ఉదయం నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు కేటీఆర్ , హరీష్ రావు పాల్గొన్నారు. అనంతరం కేటీఆర్ మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. దాసోజు శ్రవణ్‌ను గతంలోనే టీఆర్ఎస్ ప్రతిపాదించిందని.. 2023లో అప్పుడు బీజేపీ ఆపిందన్నారు. ఆయన గతంలో టీఆర్ఎస్‌ను వీడకపోతే ఎప్పుడో ఎమ్మెల్సీ అయ్యేవారని అన్నారు. పట్టుబట్టి బీజేపీ ఆపిందని... ఇప్పుడు వారు ఆపినప్పటికీ దాసోజుకు బీఆర్ఎస్ అవకాశం ఇచ్చిందని మాజీ మంత్రి అన్నారు. రేవంత్ రెడ్డిది ఢిల్లీలో ఏమీ నడుస్తలేదన్నారు. సాక్షాత్తు రాహుల్ గాంధీ గుజరాత్‌లో రేవంత్‌ను ఉద్దేశించి తమ పార్టీలో బీజేపీకి కోవర్టులు ఉన్నారని అన్నారన్నారు. రేవంత్ జుట్టు ఢిల్లీలో ఉందని.. ఆయన స్థానంలో ఎవరు ఉన్నా అదే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. స్ట్రాంగ్ లీడర్లను బీజేపీ, కాంగ్రెస్ ఎదగనివ్వదని విమర్శించారు. ఇప్పటికీ మంత్రివర్గ విస్తరణ లేదన్నారు. రేవంత్ రెడ్డికి అంత ఉంటే ముందు కేబినెట్ విస్తరణ చేసేవారన్నారు. 39 సార్లు ఢిల్లీకి ఫ్లైట్ ఎక్కడం దిగడం తప్ప చేసింది ఏం లేదని విమర్శలు గుప్పించారు. రేవంత్ రెడ్డి చుట్టూ నలుగురు రియల్ ఎస్టేట్ బ్రోకర్లు ఉన్నారని కామెంట్స్ చేశారు. వారి సహకారంతో డబ్బులు భారీగా సంపాదిస్తున్నారని ఆరోపించారు. టీడీఆర్ పేరిట రేవంత్ రెడ్డి భారీ కుంభ కోణానికి తెర లేపబోతున్నారని.. వెంటనే దీనిమీద శ్వేతా పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 1947 నుంచి దేశ చరిత్రలో ఇప్పటివరకు ఏ సీఎం ఇంత స్థాయిలో డబ్బులు సంపాదించడం తెలియదేమో అంటూ వ్యాఖ్యలు చేశారు. ప్రైవేట్ వ్యక్తుల దోపిడీ పెరిగి ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోందన్నారు. ఇండియా టుడే సదస్సులో రేవంత్ రెడ్డి దివాళాకోరుతనం బయట పెట్టుకున్నారని మండిపడ్డారు. ఈ బడ్జెట్ సమావేశాలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హాజరవుతారని అన్నారు. గవర్నర్ అడ్రెస్ కార్యక్రమంలో కూడా అటెండ్ అవుతారని తెలిపారు. రేవంత్ స్థాయికి తాము చాలన్నారు. 'ఒక లీడర్‌గా , మాజీ మంత్రిగా, కేసీఆర్ బిడ్డగా, ఆయన అభిమానిగా.. నా వ్యక్తిగత అభిప్రాయం మేరకు ఈ చిల్లర గాళ్ళ ముందుకు రావాల్సిన అవసరం లేదు. కేసీఆర్ వస్తారా లేదా అన్నది ఆయన వ్యక్తిగతం' అని చెప్పుకొచ్చారు. త్వరలో తెలంగాణాలో పది ఉప ఎన్నికలు రాబోతున్నాయని సంచలన ప్రకటన చేశారు. తమకు ఈ మేరకు సమాచారం ఉందన్నారు. అందులో భాగంగానే ఎమ్మెల్సీ ఎన్ని కలకు దూరంగా ఉన్నామన్నారు. బీజేపీ సోషల్ మీడియాలో ఎక్కువ.. సొసైటీలో తక్కువ అంటూ వ్యాఖ్యలు చేశారు. తెలంగాణాలో ఆర్ఆర్‌టాక్స్ నడుస్తోందన్న మోడీ ఎందుకు విచారణ చేయలేదని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డిమీద మోడీకి ఎందుకు అంత ప్రేమ అని నిలదీశారు. కిషన్ రెడ్డి నిస్సహాయుడన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలపై తమ పార్టీ పునరాలోచనలో పడిందని మాజీ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు.

## అసెంబ్లీ సమావేశాలకు కేసీఆర్ వస్తారు

### గవర్నర్ ప్రసంగం రోజు.. బడ్జెట్ రోజు హాజరవుతారు : కేటీఆర్

**హైదరాబాద్, మార్చి 10:** ఈ అసెంబ్లీ సమావేశాలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హాజరవుతారని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరుగనున్నాయి. తొలిరోజు ఉభయసభల సభ్యులను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగిస్తారు. గవర్నర్ ప్రసంగానికి కెసిఆర్ హాజరవుతారని చెప్పారు. బడ్జెట్ ప్రసంగంలోనూ కేసీఆర్ పాల్గొంటారని వెల్లడించారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థిగా దాసోజు శ్రవణ్ ఇవాళ నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన కేటీఆర్.. మీడియాతో చిట్‌చాట్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఎల్లుండి జరగబోయే అసెంబ్లీ సమావేశాలకు కేసీఆర్ హాజరవుతారని తెలిపారు. తర్వాత కొన్ని కార్యక్రమాలకు కూడా కేసీఆర్ వస్తారని పేర్కొన్నారు. కానీ కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాకపోవడమే మంచిదని ఒక కొడుకుగా తన అభిప్రాయమని చెప్పారు. కేసీఆర్ స్థాయికి కాంగ్రెస్‌లో ఎవరూ సరిపోరని అన్నారు. వాళ్ల పిచ్చి మాటలు, పనికిమాలిన దూషణలు, కారుకూతలు వినడానికి కేసీఆర్ రావద్దనేది కొడుకుగా తన అభిప్రాయమని వివరించారు.బీఆర్ఎస్ సభకు వరంగల్ అనువైన ప్రాంతమని కేటీఆర్ తెలిపారు. అన్ని రకాల రవాణా సదుపాయం ఉందని పేర్కొన్నారు. ప్లీనరీ విషయంలో ఇంకా నిర్ణయం తీసుకోలేదని చెప్పారు. దీనిపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిర్ణయం తీసుకోవచ్చని స్పష్టం చేశారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున రెండు సభలు పెడితే ఇబ్బంది అని భావించామని తెలిపారు.

## ప్రణయ్ హత్యకేసులో బాధితులకు న్యాయం: రంగనాథ్

హైదరాబాద్,మార్చి10 : తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ప్రణయ్ హత్య కేసులో నల్గొండ ఎస్సీ, ఎస్టీ కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. హత్య జరిగిన సమయంలో జిల్లా ఎస్పీగా పనిచేసిన రంగనాథ్ ఈ తీర్పుపై స్పందించారు. ఈ కేసులో కీలక విషయాలను ఆయన మీడియాకు వెల్లడించారు. ఆలస్యం అయినా.. బాధితులకు తప్పకుండా న్యాయం జరుగుతుందని చెప్పడానికి తాజా తీర్పు నిదర్శనం అన్నారు. కేసు దర్యాప్తులో కీలకంగా వ్యవహరించిన అధికారులు, సాక్షులకు ఆయన అభినందలు తెలిపారు. ప్రస్తుతం రంగనాథ్.. హైడ్రా కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.





# విపక్షాల సమర్థతకు విషమ పరీక్ష!

పార్లమెంట్ మలివిడత బడ్జెట్ సమావేశాలు సోమవారం ప్రారంభం అయ్యాయి. దేశంలో ఉన్న సమస్యయల దృష్ట్యా ఈ సమావేశాలే కీలకం. ఈ సమావేశాల్లో ఏ అంశంపై చర్చించాలి..చర్చించకూడదు.. సభాసమయాన్ని సద్వినియోగం చేసుకోవడమెలా అన్నది కూడా విపక్ష కాంగ్రెస్ చతురతపై ఆధారపడి ఉంది. అలాగే విపక్షాలు కూడా సమర్థత ప్రదర్శించాల్సి ఉంది. కేవలం అల్లరి చేసి వాకట్లు చేయడమో. ప్రతిష్టంభనతో సభ వాయిదా వేయించడం వల్లనో సమస్యలు చర్చకు రావు. ఇది గమనించి కాంగ్రెస్ వ్యూహాత్మకంగా వ్యవహరించాల్సి ఉంది. లేకుంటే అది విపక్ష పార్టీగా విఫలం అయినట్లే. ప్రధానంగా డిటిమిటేషన్ భయాలు, జనగణన,జిఎస్టీ, నిరుద్యోగం, ఔషధధరలు, పెరుగుతున్న నిత్యావసర ధరలు వంటి ప్రధాన సమస్యలు దేశాన్ని పట్టిపీడిస్తున్నాయి. ప్రధానంగా ఇప్పుడు డీలిమిటేషన్‌పై సర్వత్రా చర్చ నడుస్తోంది. దక్షిణాది రాష్ట్రాల్లో జనాభా ప్రాతిపదికన సీట్లు తగ్గుతాయని ఆందోళన వ్యక్తం అవుతోంది. దీనిపై బిజెపి లేదా ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదు. తెలంగాణ బిజెపి నేతలు మాత్రం సీట్లు తగ్గవని అంటున్నారు. ఇంతకీ ఇప్పుడున్న సీట్లు తగ్గవా లేక, పెరిగే సీట్లు తగ్గవా అన్నది స్పష్టం చేయకుండా గోడవాటం పిల్లిలా వ్యవహరిస్తున్నారు. అమెరికా తరహాలోనే భారత్ కూడా ప్రజ్యాస్వామ్య వ్యవస్థ కలిగిన సమాఖ్య రాజ్యం. 1971లోని జనాభా నిష్పత్తి ప్రకారం ప్రాతినిధ్యం కల్పించడం వల్ల ఊహించని ప్రమాదాలు ఎదురవుతాయనే వాస్తవాన్ని గుర్తించాము. అయితే ఒక పరిష్కారాన్ని కనుగొనడానికి బదులు దాన్ని 2026 దాకా వాయిదా వేశాము. చివరి జనాభా గణన 2011లో జరిగింది. తదుపరి జనాభా గణన 2021లో జరగవలసి ఉండగా కోవిడ్ విలయం వల్ల వాయిదా వేశారు. 2021 నుంచి ఏదో ఒక సాకుతో జనాభా గణన జరగనే లేదు. తాజాగా కులగణన అంటూ కాంగ్రెస్ రాజకీయాలు మొదలు పెట్టింది. దీంతో సమాజంలో చీలిక తప్ప మరోటి రాదు. ఇది ఓ రకంగా అచ్చం రాజకీయ లబ్దికోసం చేస్తున్న డిమాండ్ తప్ప మరోటి కాదు. ఈ క్రమంలో 2026లో జనాభా గణన అనంతరం విధిగా లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన జరగవలసి ఉన్నది. ప్రతి రాష్ట్రానికి కేటాయించే సీట్ల సంఖ్యను కూడా అప్పుడే నిర్ణయిస్తారు. జనాభా పెరుగుదల అదుపులేకుండా జరిగినందుకు కొన్ని రాష్ట్రాలకు ప్రయోజనాలు కల్పిస్తారు. సంపూర్ణ ప్రజనన రేటు 2 శాతం, అంతకంటే తక్కువగా ఉండాలన్న నిర్దేశిత లక్ష్యాన్ని సాధించిన రాష్ట్రాలను సీట్ల కుదింపుతో శిక్షించనున్నారన్న ప్రచారం సాగుతోంది. ఇలా కేవలం జనాభా ప్తరాపిదకిగా కాకుండా మధ్యేమార్గం అవలంబించాల్సిన అసవరం ఇప్పుడు కనిపిస్తోంది. పునర్విభజనతో దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయని తమిళనాడు సిఎం స్టాలిన్ పోరుబాట పట్టారు. జనాభా నిష్పత్తి సూత్రానికి అనుగుణంగా ఆయా రాష్ట్రాల సీట్ల సంఖ్యను పునర్ నిర్ధారించడం ద్వారా దక్షిణ్రాది రాష్ట్రాలకు నషటం జరగడం ఖాయంగా కనిపిస్తోంది. దక్షిణాది రాష్ట్రాల్లో ఇప్పుడు లోక్‌సభలో 129 స్థానాలున్నా వారి గళం పెద్దగా విన్పించడం లేదు. ఇప్పుడా సీట్ల సంఖ్య మరింతగా తగ్గితే దక్షిణాది ప్రతినిధుల మాటను కేంద్రం పట్టించుకోదు. సీట్ల సంఖ్య తగ్గించబోమనే హామీలో నిజాయితీ కొరవడింది. ఇదే సందర్భంలో జనాభా అత్యధికంగా ఉన్న యూపీ, బిహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌ల సీట్ల సంఖ్యను పెంచబోమని కేంద్రం స్పష్టంగా ప్రకటించడం లేదు. సీట్ల సంఖ్య పునర్ నిర్ధారణకు జనాభా నిష్పత్తి సూత్రాన్ని అనుసరించిన పక్షంలో దక్షిణాది రాష్ట్రాల బలం మరింతగా తగ్గిపోతుంది. పర్యవసానంగా పార్లమెంటులో దక్షిణాది వారి గళం వినిపించే వారి సంఖ్యా తగ్గుతుంది. ఈ రాష్ట్రాల సమస్యల పరిష్కారం పట్ల నిర్లక్ష్యం పెరుగుతంది. కొన్ని రాష్ట్రాలకు సీట్ల సంఖ్యను కుదించాలన్నా, పెంచాలన్నా ఇప్పుడున్న సీట్ల సంఖ్యను అనివార్యంగా పెంచాలి. రాష్ట్రాల సైజు బట్టి సీట్లను పెంచడం కూడా ఆలోచించాలి. లోక్‌సభకు ఎన్నికయ్యే ప్రతినిధుల సంఖ్యను విధిగా పెంచవలసి ఉంటుంది. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన, 1977లో రాజ్యాంగానికి 42వ సవరణ జరిగింది. లోక్‌సభలో ప్రస్తుతం రాష్ట్రాల నుంచి ఎన్నికైన ప్రతినిధులు 530 మంది, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 13 మంది ఉన్నారు. అధికరణ 81లోని నిబంధన 2(ఎ) ప్రకారం ప్రతి రాష్ట్రం నుండి లోక్‌సభకు ఎంతమంది ఎన్నిక కావాలనే విషయం ఆ రాష్ట్ర జనాభాపై ఆధారపడి ఉంటుంది. జనాభాకు, లోక్‌సభ సభ్యుల సంఖ్యకు గల నిష్పత్తి సాధ్యమైనంతవరకు అన్ని రాష్ట్రాలకు ఒకే విధంగా ఉంటే పేచీ ఉండదు. ఇకపోతే ప్రధానంగా మరో రాజ్యాంగ సవరణ కూడా చేయాల్సి ఉంది. ఇప్పుడున్న ఎంపిలు, ఎమ్మెల్యేలు వరుసగా వారే ఎన్నికవుతూ వస్తున్నారు.. కలు,ధనబలం ద్వారా ఒక్కరే ఆరేడు పర్యాయాలు సభ్యులుగా ఉంటున్నారు. ఇది పోవాల్సిన అవసరం ఉంది. 140 కోట్లు ఉన్న దేశంలో కొందరే నిరంతరంగా చట్టసభలను గబ్బిలాల్లో పట్టుకుని వెళ్లాడుతున్నారు. ఇందులో అన్ని పార్టీల వారూ ఉన్నారు. ఇది పోతేనే దేశం బాగుపడదు. అలాగే ప్రజాస్వామ్యం బలపడదు. దీనిపై బిజెపి దృష్టి పెట్టాల్సి ఉంది. కనీసం రెండు టర్మలకు మించి ఎన్నిక కాకుండా రాజ్యాంగ సవరణ చేయాలి. మూడో దఫాలో అధికారం చేపట్టిన మోడీ అనేక ఆశలు కల్పించారు. ఇలాంటి సంస్కరణలు చేపడితే ప్రజలు ఆమోదిస్తారు. హర్షిస్తారు. రాజకీయ పార్టీల నేతలు జీవితాంతం చట్టసభల్లో తిష్టవేయకుండా చేస్తే..దేశ ప్రయోజనాలు కాపాడిన వారు అవుతారు. ఇందుకు అన్ని రాజకీయ పార్టీలు తమ సచ్ఛీలతను చాటుకోవాల్సి ఉంది. ముందుగా మోడీ ఇందుకు సిద్దం కావాలి.

# కెనడా నూతన ప్రధానిగా మార్క్ కార్నీ


## భారత్‌తో సంబంధాలు పునరుద్దణకు పెద్దపీట



**న్యూఢిల్లీ, మార్చి 10:** కెనడా లిబరల్ పార్టీ దేశ తదుపరి ప్రధానమంత్రిగా మార్క్ కార్నీని అత్యధిక మెజారిటీతో ఎన్నుకుంది. జస్టిన్ ట్రూడో స్థానంలో మార్క్ కార్నీని ఎన్నుకున్నారు. తుది లెక్కల ప్రకారం, లిబరల్ పార్టీ నాయకత్వ ఓట్లలో పోలైన బ్యాలెట్లలో కార్నీ 85.9శాతంసాధించి గెలిచారు. జస్టిన్ ట్రూడో స్థానంలో కార్నీ బాధ్యతలు స్వీకరించి, కొంత కాలం మాత్రమే ఆ పదవిలో ఉంటాడు. ఎందుకంటే కెనడాలో అక్టోబర్ నాటికి ఎన్నికలు నిర్వహించాలి. విజయోత్సవ సభలో కార్నీ మాట్లాడుతూ ట్రంప్ నేతృత్వంలోని యునైటెడ్ స్టేట్స్(యుఎస్) కెనడాను నియంత్రణ సాధించేందుకు ప్రయత్నిస్తోందని హెచ్చరించారు. ఈ ప్రయత్నాన్ని తిప్పికొట్టాలని తెలిపారు. యుఎస్ కెనడా వనరులను, నీటిని, భూమిని, దేశాన్ని కోరుకుంటున్నారని తెలిపారు. కెనడియన్ కార్మికులు, కుటుంబాలు, వ్యాపారాలపై ట్రంప్ దాడి చేస్తున్నారని మండిపడ్డారు. మార్క్ కార్నీ భారత్–కెనడా సంబంధాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. ట్రూడో అధికారంలో ఉన్న సమయంలో భారత్‌తో దెబ్బతిన్న సంబంధాలను తిరిగి పునరుద్ధరిస్తానన్నారు. తాను అధికారంలోకి వచ్చిన వెంటనే ఆవిధంగా కృషి చేయడానికి ఎదురుచూస్తున్నానని పేర్కొన్నారు. న్యూఢిల్లీతోనే కాకుండా సారూప్యత కలిగిన దేశాలతోనూ వాణిజ్య సంబంధాలను బలోపేతం చేయడానికి తగిన చర్యలు తీసుకుంటానని తెలిపారు. భారత్‌పై తన వైఖరిని ఇదివరకే ఓ ఇంటర్వ్యూలో ఆయన స్పష్టంచేసిన విషయం తెలిసిందే. తాజా వ్యాఖ్యలు ఆయనకు భారత్‌పై ఉన్న సానుకూల ధోరణిని వ్యక్తపరుస్తున్నాయి. దశాబ్దాల తరబడి మిత్రదేశాలుగా ఉన్న భారత్, కెనడాల మధ్య సంబంధాలు ఇటీవల బాగా దెబ్బతిన్నాయి. కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ( నిరుడు తమ పార్లమెంటులో మాట్లాడుతూ.. ఖలిస్థానీ ఉగ్రవాది హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్య వెనక భారత్ ఏజెంట్ల హస్తం ఉండొచ్చని చేసిన వ్యాఖ్యలు ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు రాజేశాయి. భారత్ వెంటనే వాటిని తిప్పికొట్టింది. అనంతరం ఇరుదేశాలు పరస్పరం దౌత్యవేత్తలను తిప్పి పంపివేశాయి. ఆ క్రమంలోనే వరసగా జరిగిన కొన్ని పరిణామాలతో ఉభయదేశాల దౌత్య, వాణిజ్య సంబంధాలు క్షీణించాయి. ఈనేపథ్యంలో కెనడాకు నూతన ప్రధానిగా అధికార లిబరల్ పార్టీ నేత మార్క్ కార్నీ ఎన్నికవ్వడం.. ఆయన భారత్‌కు అనుకూలంగా ఉండడంతో భవిష్యత్తులో ఇరుదేశాల మధ్య సంబంధాలు మెరుగయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# ప్రణయ్ హత్య కేసులో నల్గొండ కోర్టు సంచలన తీర్పు

- సుభాష్ శర్మకు ఉరి శిక్ష..
- మిగిలిన వారికి యావజ్జీవ శిక్ష



**నల్గొండ,మార్చి10 :** రెండు తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన మిర్యాలగూడ పెరుమాళ్ల ప్రణయ్ హత్య కేసులో తుది తీర్పును సోమవారం నల్లగొండ కోర్టు వెల్లడించింది. ఏ2 సుభాష్ శర్మకు ఉరిశిక్ష విధిస్తూ న్యాయస్థానం సంచలన తీర్పు ఇచ్చింది. నిందితులు అందరికీ యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ ఎస్సీ, ఎస్టీ సెషన్స్ రెండో అదనపు న్యాయ స్థానం కీలక తీర్పు వెలువరించింది. 302, 120 ఐపీసీ, 109, 1989 సెక్షన్ ఐపీసీ ఇండియన్ ఇండియన్ ఆర్మ్ యాక్ట్ 1959 ప్రకారం శిక్ష విధించింది. శిక్ష తగ్గించాలని న్యాయమూర్తిని ఈ సందర్భంగా నేరస్తులు వేడుకున్నారు. హార్ట్ పెషేంట్, కుటుంబ సభ్యుల ఆరోగ్యం, చిన్న పిల్లలు ఉన్నారని కొందరు నేరస్తులు న్యాయ స్థానానికి తెలిపారు. ఉగ్రవాది అస్గర్ అలీకి సుపారీ.. అయితే ఏ2 సుభాష్ శర్మకు నల్గొండ కోర్టు ఉరిశిక్ష విధించింది. ప్రణయ్ హత్యలో సుభాష్ శర్మ కీలకపాత్ర పోషించాడు. సుభాష్ శర్మకు ఉరిశిక్ష విధిస్తూ నల్గొండ కోర్టు తీర్పు వెలువరించింది. ఇప్పటికే జైల్లో ముగ్గురు నిందితులు శిక్ష అనుభవిస్తున్నారు. ఉగ్రవాది అస్గర్ అలీకి సుపారీ ఇచ్చి ప్రణయ్‌ను అమృత తండ్రి హత్య చేయించాడు. ఏడుగురితో ఓ గ్యాంగ్‌ను అస్గర్ అలీ ఏర్పాటు చేశాడు. గుజరాత్ మాజీ హెూంమంత్రి హరెన్ పాండ్యా హత్య కేసులో నిందితులతో కలిపి అస్గర్ అలీ గ్యాంగ్ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. కాగా.. పెరుమాళ్ల ప్రణయ్ హత్యకేసులో నల్లగొండ ఎస్సీ, ఎస్టీ జిల్లా సెషన్‌కోర్టు కీలక తీర్పు వెలువరించింది. 2018 సెప్టెంబర్ 14వ తేదీన హత్యకు ప్రణయ్ గురయ్యాడు. గర్భవతిగా ఉన్న భార్య అమృతను నల్లగొండ జిల్లా మిర్యాలగూడలోని ఆస్పత్రికి తీసుకువెళ్లి.. తిరిగి వస్తుండగా.. దుండగులు ప్రణయ్‌పై కత్తులతో దాడి చేసి హతమార్చారు. తన కూతురిని కులాంతర వివాహం చేసుకున్నాడనే కక్షతో సుఫారీ గ్యాంగ్‌తో ప్రణయ్‌ను మారుతీరావు హత్య చేయించాడు. ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పోలీసుశాఖ అన్ని కోణాల్లో విచారణ పూర్తిచేసి 1600పేజీల్లో చార్జిషీట్ నివేదికను రూపొందించింది. అప్పటి ఎస్పీ ఏవీ రంగనాథ్ పర్యవేక్షణలో విచారణ పూర్తిచేసి హత్యకేసుల్లో ఎనిమిది మంది నిందితుల పాత్ర ఉందని నిర్ధారించి, 2019 జూన్ 12 వ తేదీన చార్జిషీట్ దాఖలు చేయగా నల్లగొండ ఎస్సీ, ఎస్టీ జిల్లా సెషన్ కోర్టు విచారణ మొదలుపెట్టింది. సుమారు 5సంవత్సరాల 9నెలల కాలం పాటు విచారణ కొనసాగగా, పోలీస్ శాఖ సమర్పించిన చార్జిషీట్ నివేదిక, పోస్టుమార్టం రిపోర్టు, సైంటిఫిక్ ఎవిడెన్స్‌లతో పాటు సాక్షులను న్యాయస్థానం విచారించి తుది తీర్పును ఈరోజు రిజర్వు చేసింది. ప్రణయ్ హత్యకేసులో ఏ1 తిరునగరు మారుతీరావు, ఏ2 బీహార్‌కు చెందిన సుభాష్‌శర్మ, ఏ3 అజ్గర్‌అలీ, ఏ4 అబ్దుల్‌బారీ, ఏ5 ఎం.ఏ కరీం, ఏ6 తిరునగరు శ్రవణ్‌కుమార్, ఏ7 శివ, ఏ8 నిజాం నిందితులుగా పోలీసులు కోర్టుకు సమర్పించిన చార్జిషీట్‌లో పేర్కొన్నారు. ప్రధాన నిందితుడు మారుతీరావు(ఏ–1) 2020 మార్చిలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ కేసులో నిందితుల పాత్రపై సాక్ష్యాధారాలను పరిగణించి శిక్ష ఖరారు చేస్తూ న్యాయస్థానం వెల్లడించింది. సుభాష్‌శర్మ (ఏ–2), అస్గర్‌అలీ(ఏ–3) విచారణ ఖైదీలుగా ఉన్నారు. మిగిలిన ఐదుగురు నిందితులు బెయిల్‌పై విడుదలై కోర్టు విచారణకు హాజరవుతున్నా విషయం తెలిసిందే.

# ఇంటర్నేషనల్ డ్రగ్ డీలర్ షెహనాజ్ సింగ్ అరెస్ట్

## వెల్లడించిన పంజాబ్ డీజీపీ



**చండీఢఘడ్, మార్చి 10 :** అమెరికా సహా పలు దేశాలకు మాదక ద్రవ్యా లను సరఫరా చేస్తున్న అంత ర్జాతీయ డ్రగ్ డీలర్‌ను పంజా బ్ పోలీసులు పట్టుకున్నారు. ఎఫ్‌బీఐ మోస్ట్‌వాంటెడ్ జాబితాలో ఉన్న ఇంటర్నేషనల్ డ్రగ్ లార్డ్ షెహనాజ్ సింగ్ అలియాస్ షాన్ భిందెర్‌ను అరెస్టు చేసినట్లు పంజాబ్ డీజీపీ సామాజిక మాధ్యమాల్లో ప్రకటించారు. నార్కోటిక్స్ సిండికేట్‌లో అతడు కీలకంగా వ్యవహరిస్తున్నాడని, కొలంబియా నుంచి అమెరికా, కెనడాలోకి మాదకద్రవ్యాలను స్మగ్లింగ్ చేస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. షెహనాజ్ అక్రమాలపై ప్రత్యేక నిఘా పెట్టిన అమెరికా ఎఫ్‌బీఐ ఫిబ్రవరి 26న అతడి అనుచరులను అరెస్టు చేసింది. వారినుంచి 391 కేజీల మెథంఫెటమైన్, 109 కేజీల కొకైన్ సహా నాలుగు ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ పరిణామాలతో షెహనాజ్ భారత్‌కు పారిపోయి వచ్చాడు. దానిపై నిఘా వర్గాల నుంచి సమాచారం రావడంతో పంజాబ్ తర్న్ తరణ్ పోలీసులు రహస్య ఆపరేషన్ చేపట్టారు. అతడి జాడను గుర్తించి తాజాగా అరెస్టు చేసినట్లు డీజీపీ వెల్లడించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వ్యవస్థీకృత నేరాల కట్టడికి తాము కఠిన చర్యలు తీసుకుంటున్నామని చెప్పేందుకు ఆ ఆపరేషన్ నిదర్శనమని పంజాబ్ పోలీసులు వెల్లడించారు. డ్రగ్ స్మగ్లర్లు, క్రిమినల్స్‌కు పంజాబ్ స్వర్గధామం కాదని హెచ్చరించారు.

# మిలియన్ మార్చ్‌కు 14 ఏళ్లు

## నాటి పరిస్థితులను గుర్తుచేసుకున్న కేటీఆర్, హరీశ్‌రావు

**హైదరాబాద్, మార్చి 10:** తెలంగాణ మలిదశ ఉద్యమంలో అత్యంత కీలకమైన ఘట్టాల్లో ఒకటైన మిలియన్ మార్చ్‌కు నేటితో 14 ఏళ్లు పూర్తి అయిన నేపథ్యంలో బీఆర్‌ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు నాటి సందర్భాన్ని గుర్తుచేసుకున్నారు. అప్పటి కాంగ్రెస్ పాలకుల ఆంక్షలకు తట్టుకొని.. నిర్భంధాలకు ఎదురొడ్డి.. అరెస్టులను ఎదురించి.. లక్షలాది తెలంగాణ ఉద్యమకారులు తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ట్యాంక్ బండ్‌పై గర్జించిన అపురూప సన్నివేశాలు ఇప్పటికీ కళ్ల ముందు మెదులుతున్నాయని కేటీఆర్ అన్నారు. తెలంగాణ ఉద్యమంలో వివిధ పోరాట రూపాల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొన్న ప్రతీ ఒక్కరికీ కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ అమరవీరులకు జోహార్.. జై తెలంగాణ అని వ్యాఖ్యానించారు. 'మిలియన్ మార్చ్'తో తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగసిపడ్డ సందర్భమని హరీశ్‌రావు అన్నారు. ఆంక్షల పద్మవ్యూహాన్ని బద్దలుకొట్టుకుని లక్షలాదిగా జనం తరలివచ్చారని గుర్తుచేసుకున్నారు. స్వరాష్ట్ర సాధన కోసం ఉవ్వెత్తున ఎగసిన ఉద్యమ ప్రస్థానంలో అదో కీలక ఘట్టమని వ్యాఖ్యానించారు. ప్రపంచ ప్రజా ఉద్యమాల సరసన తెలంగాణ ఉద్యమాన్ని నిలిపిన అసలు సిసలు ప్రజా విప్లవమని అన్నారు. ఆంక్షలు, నిర్బంధాల కట్టడిని చిత్తడి చేసి జలమార్గం గుండా టాంక్ బండ్ చేరుకొని, మిలియన్ మార్చ్ లో పాల్గొని నేటికీ 14 ఏళ్లు పూర్తయ్యాయని అన్నారు. ఆ అపురూప దృశ్యాలు ఇప్పటికీ కళ్ళ ముందు కదలాడుతున్నాయని చెప్పారు. నాటి ఉద్యమ పోరాటాలు ఇంకా రగిలిస్తూనే ఉన్నాయని అన్నారు. స్వరాష్ట్ర సాధన కోసం కేసీఆర్ గారి నాయకత్వంలో తెలంగాణ ప్రజలు చూపిన తెగువకు, పోరాటానికి సెల్యూట్ అని అన్నారు. ప్రాణాలు సైతం అర్పించిన అమరులకు జోహార్ తెలిపారు.

# పార్టీకి ద్రోహం చేస్తున్నారని మావోయిస్టుల లేఖ

## అటవీ సంపదను దోచుకునేందుకే ఆపరేషన్ కగార్

**ఛత్తీస్‌గడ్, మార్చి 10:** అటవీ సంపదను కేంద్ర ప్రభుత్వం దోచుకునేందుకు ఆపరేషన్ కగార్‌ను తీసుకొచ్చిందని మావోయిస్టులు విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సౌత్ బస్తర్ డీ.వీ.సీ.ఏం సభ్యు డు మొడీయం దినేష్ అతని భార్య కళ పార్టీ డబ్బుతో పారిపోయి పోలీసులకు లొంగిపోయారు. ఇరవై ఏళ్ల ఉద్యమ జీవితంలో ఉన్న దినేష్ పార్టీకి ద్రోహం చేశారని మావోయిస్టులు లేఖలో ప్రస్తావించారు. తీవ్రమైన అణచివేతకు గురైన వారు శత్రువుకు లొంగిపోతారని మావోయిస్టులు తెలిపారు. త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని 'ఆపరేషన్ కగార్' యుద్దాన్ని అడ్డుకుంటామని హెచ్చరించారు. సౌత్ సబ్ జోనల్ బ్యూరో పేరుతో మావోయిస్టులు లేఖ విడుదల చేశారు. కాగా.. దండకారణ్యం, ఛత్తీస్‌గఢ్ అడవుల్లో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్ నిలిపివేయాలని గత కొంత కాలంగా మావోయిస్టులు కోరుతున్న విషయం తెలిసిందే. దండకారణ్యంలో ఆపరేషన్ కగార్ పేరిట మావోయిస్టులను, ఆదివాసీలను కేంద్ర ప్రభుత్వం హత మారుస్తోందని, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకోవాలని మావోయిస్టులు డిమాండ్ చేశారు. అడవుల్లో జీవిస్తున్న ఆదివాసీలను వెళ్లగొట్టడానికి కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుందని, అడవుల్లో ఆదివాసీలకు మావోయిస్టులు అండ అని అన్నారు. ఆదివాసీలను లేకుండా చేసి అడవుల్లో ఉన్న అపారమైన ఖనిజ సంపదను బహుళజాతి సంస్థలకు అమ్ముకోవడానికి కేంద్ర ప్రభుత్వం చూస్తోందని, దీనిని ప్రజలు, మేధావులు తిప్పికొట్టాలని మావోయిస్టులు పిలుపునిచ్చారు.

## వర్గీకరణకు చట్టబద్ధత కల్పించే వరకు ఉద్యోగ నియామకాలు చేపట్టదు

### రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్న మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు వడ్లూరి పరుశరాములు.



జనత న్యూస్ బెజ్జంకి : ఎస్సీ వర్గీకరణ సెమీమ్ అక్తర్ నివేదిక లో లోపాలను సవరణ చేసి, రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ సామాజిక వర్గానికి న్యాయం చేయాలని పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు సోమవారం మండల కేంద్రంలో మాదిగ డప్పు కళాకారుల చేత పురవీధులలో డప్పుల ప్రదర్శన నిర్వహించినట్లు ఎమ్మార్పీఎస్ బెజ్జంకి మండల అధ్యక్షులు వడ్లూరు పరుశరాములు విడుదల చేసిన పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణను సవరిస్తూ మంత్రివర్గ విస్తరణలో జనాభా ప్రకారం ఇద్దరు మాదిగ ఎమ్మెల్యేలకు మంత్రులుగా అవకాశం ఇవ్వాలని, వర్గీకరణ 3 గ్రూపులు కాకుండా, 4 గ్రూపులుగా చేయాలని రాష్ట్ర ప్రభుత్వం మరియు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీ ఈ డప్పుల ప్రదర్శనల ద్వారా తమ ఆకాంక్ష తెలియజేస్తున్నట్లు తెలుపుతూ, వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించే వరకు రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ప్రభుత్వ ఉద్యోగాలు చేపట్టకూడదని మాదిగ సామాజిక వర్గం తరపున రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

### దళిత సంఘాల ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే వర్ధంతి వేడుకలు

మండల కేంద్రంలో దళిత సంఘాల ఆధ్వర్యంలో సోమవారం వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఓరుగంటి ఆనంద్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ, సావిత్రిబాయి పూలే భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలని, స్త్రీ విద్య కోసం, అణగారిన సామాజిక వర్గాల అభ్యున్నతి కోసం ఎంతో కృషి చేశారని, వివక్షకు వ్యతిరేకంగా నిరంతరం పోరాటం చేసిన వీరవనిత అని కొని ఆడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు వడ్లూరి పరుశరాములు, ఎమ్మార్పీఎస్ నాయకులు చింతకింది పరుశరాములు, మంకాల బాలయ్య, కండే మల్లేశం, కొంకటి రాములు, కాంగ్రెస్ నాయకులు శానగొండ శరత్ కుమార్, కర్రావుల సందీప్, బీఎస్పీ నాయకులు నిషాని రాజమల్లు, స్వేరో రాష్ట్ర నాయకులు బొర్ర సురేష్ కుమార్, ఉప్పులేటి బాబు, అంబేద్కర్ సంఘ నాయకులు బోనగిరి కొత్త రాజు, ఏఐవైఎఫ్ నాయకులు దొంతర వేణి మహేష్ తదితరులు పాల్గొన్నారు.



# రసమయిది నీచ చరిత్ర నాపై మాట్లాడే స్థాయి నీకు లేదు

### నీ బాధితులే నీ గురించి చెబుతారు

### రసమయిపై మండిపడ్డ ఎమ్మెల్యే కవ్వంపల్లి

తిమ్మాపూర్, జనతా న్యూస్ మానకొండూరు మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ది నీచ చరిత్రని, గోసి గొంగడి తో వచ్చిన రసమయికి ఇన్ని ఆస్తులు ఎక్కడి నుండి వచ్చాయంటూ

మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కపంపల్లి సత్యనారాయణ ప్రశ్నించారు. సోమవారం ఎల్ఎండి కాలనీలోని అరుంధతి భవన ఆవరణలో ఆయన విలేకరులతో ముచ్చటిస్తూ మాజీ ఎమ్మెల్యే రసమయిపై మండిపడ్డారు. నేను ఒక డాక్టర్ను, అసిస్టెంట్ ప్రొఫెసర్ ను, గెజిటెడ్ ఆఫీసర్ ని, నా భార్య ఒక డాక్టర్, నేను 2009లో రాజకీయాల్లోకి వచ్చాను. అంతకుముందే నాకు హైదరాబాదులో ఆస్తులు ఉన్నాయి. బిల్డింగులు ఉన్నాయి. నాకున్న ఆస్తులను ఎన్నికల అఫిడవిట్లో చూపించాను. మొన్న ఒక బిల్డింగు అమ్మితే కోట్ల రూపాయలు వచ్చాయి. నేను ప్రొఫెషనల్ వ్యక్తిని. ఇలాంటి నాతో నీకు పోలిక ఎక్కడిది అంటూ మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఘాటుగా స్పందించారు. నీవు ఒక టీచర్ వి, నీ భార్య నర్సు, నీవు హైదరాబాదులో ఎక్కడ ఉంటావో తెలుసు, ఒక్కొక్కరిని ఎంత గోస పెట్టినావో తెలుసు.



ఎంతమందిని వేధించినవో తెలుసు. నీవు ఆట పాటలతో గోసి గొంగడితో తిరిగినావ్, అలాంటి నీకు ఇన్ని వేల ఆస్తులు ఎక్కడి నుండి వచ్చాయి. నీవు డబ్బులకు పదవులను అమ్మకున్నది నీ బాధితులే చెబుతున్నారు. పోరండ్ల సొసైటీలో చైర్మన్ పదవులని అమ్ముకున్నది నీవు. డబ్బులు తీసుకునే నీలాగా అందరూ ఉంటారు అనుకోవడం మూర□త్వం. నీకున్న బుద్ధులను నాకు ఆపాదించడం మానుకో. నీ గురించి మాట్లాడడం మానేశాను. నా స్థాయిని దిగజార్చుకోను. నీకు నాతో పోలికనా. నాకు నీకు నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉన్నది. నీది అడుక్కునే స్థాయి. నన్ను విమర్శించే స్తాయి కాదు. అల్వాల కోటికి నుస్తులాపూర్ సొసైటీ చైర్మన్ పదవిని ఎందుకు తీసేశావు ప్రజలకు చెప్పాలి. గంకిడి లక్ష్మారెడ్డికి పోరండ్ల సహకార సంఘం చైర్మన్ పదవి ఎందుకు ఇవ్వలేదో ప్రజలందరికీ తెలుసు అంటూ మాజీ ఎంఎల్ఏ రసమయి బాలకిషన్ పై ఎంఎల్ఏ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ నిప్పులు చెరిగారు. రసమయి బాగోతం గ్రామాల్లోని కాంగ్రెస్ పార్టీ నాయకులే బయటపెడతారని ఎమ్మెల్యే కవ్వంపల్లి తెలిపారు. ఇకనైనా తప్పుడు ఆరోపణలు చేయడం మానుకొవాలని ఇతవు పలికారు.

## విగ్రహాలను ఆవిష్కరించకుంటే పోరాటం ఉధృతం చేస్తాం

### పొలిటికల్ జెఏసి నేతలు

తిమ్మాపూర్, జనతా న్యూస్ : తిమ్మాపూర్ మండల కేంద్రంలో నెలకోల్పిన డాక్టర్ బిఆర్ అంబేడ్కర్,మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రాం విగ్రహాలను ముసుగులు తొలగించి ఆవిష్కరించకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని పొలిటికల్ జేఏసీ నేతలు తెలిపారు. తిమ్మాపూర్ మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం పక్కన రిలే నిరాహారదీక్షలను సోమవారం సాంబారి కొమురయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా జెఏసి,నాయకులు మాట్లాడుతూ గత రెండేళ్ల క్రితం మండల కేంద్రంలో నెలకోల్పిన మహనీయుల విగ్రహాలను ఆవిష్కరించేందుకు ప్రజాప్రతినిధులు,ప్రభుత్వ అధికారులు,వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.జెఏసి ఆధ్వర్యంలో సంబంధిత అధికారులకు దశలవారీగా వినతి పత్రాలు సమర్పించామని అధికారులు గానీ ప్రజాప్రతినిధులు గానీ ఇంతవరకు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.రాజ్యాంగ నిర్మాత,ఉప ప్రధాని విగ్రహాలను ముసుగులు వేసి అవమాన పరచడం సమంజసం కాదని, ఇప్పటికైనా అధికారులకు సానుకూలంగా స్పందించి ముసుగులు తొలగించి ఆవిష్కరించేందుకు సహకరించాలని కోరారు. లేనిపక్షంలో మండలంలోని అన్ని వర్గాల ప్రజలను ఐక్యం చేసి,చైతన్యం కలిగించి మహనీయుల విగ్రహాలను ఆవిష్కరించే వరకు రిలే నిరాహారదీక్షలు కొనసాగిస్తూనే,పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని పొలిటికల్ జేఏసీ నేతలు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు వంతడుపుల సంపత్,సుగుర్తి జగదీశ్వరా చారి,దుండ్ర రాజయ్య యాదవ్,మాతంగి శంకర్,సముద్రాల లక్ష్మన్,బోయిని కొమురయ్య,దమ్మననేని నర్సింగరావు,మాతంగి అశోక్,పాశం అశోక్ రెడ్డి,కనకం రాములు,పారునంది జలపతి,ఎల్కపెల్లి సంపత్,వడ్లూరి శంకర్, మాతంగి లక్ష్మన్,కన్నం లక్ష్మన్,ఎల్కపెల్లి సిద్దార్థ్,తాటి పెల్లి సంపత్, ఉప్పులేటి రాజు,పడాల ప్రసాద్ గౌడ్,గంగిపెల్లి సంపత్,,గాజ సాగర్,ఎడ్ల భూంరెడ్డి,సంగుపట్ల మల్లేశం,,బోయిని తిరుపతి తదితరులతో సుమారు 60 మంది నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో సావిత్రిబాయి పూలే వర్ధంతి వేడుకలు

జనత న్యూస్ బెజ్జంకి : బెజ్జంకి మండలం కేంద్రంలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సావిత్రిబాయి పూలే వర్ధంతి వేడుకలు సోమవారం విద్యార్థుల మధ్యలో ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వడ్లకొండ శ్రీనివాస్ పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. పూలే చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించి , విద్యార్థులకు పూలే దంపతుల యొక్క గొప్పతనాన్ని, వారి త్యాగాన్ని విద్యార్థులకు వివరించినట్లు ప్రధాన ఉపాధ్యాయులు శ్రీనివాస్ పేర్కొన్నారు . ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నా రోజు శంకరాచారి, ఐ.శ్రీవిద్య విద్యార్థులు పాల్గొన్నారు.



# కవ్వంపల్లిపై రసమయివి తప్పుడు ఆరోపణలు

**బురదజల్లడం మానకుంటే భరతం పడతాం**

**గోసి గొంగడితో వచ్చిన రసమ-యికి కోట్ల ఆస్తులు ఎక్కడివి**

**మోసకారి రసమయి - రాజకీయ అజ్ఞాని**

**ఆరోపణలు నిరూపించాలని కాంగ్రెస్ నాయకుల సవాల్**



తిమ్మాపూర్, జనతా న్యూస్ : మానకొండూర్ ఎంఎల్ఏ కవ్వంపల్లి సత్యనారాయణ డబ్బుల కోసమే సహకార సంఘాలకు ప్రత్యేక అధికారులను నియమించాలని అధికారులపై ఒత్తిడి చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆరోపణలు చేయడాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు ముక్తకంఠంతో తీవ్రంగా ఖండించారు. ఎల్ఎండీ కాలనీలో క్యాంపు కార్యాలయ ఆవం-ణలో సోమవారం తిమ్మాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు రసమయి అసత్య ఆరోపణలను తూర్పారబట్టారు. సింగిల్ విండో చైర్మన్లను డబ్బు డిమాండ్ చేసినట్టుగా నిరూపించాలని వారు రసమయికి సవాలు విసిరారు.

**నోరు జారితే నాలుక చీరేస్తాం : తాళ్లపల్లి**

రసమయి బాలకిషన్ నోటికొచ్చినట్టు మాట్లాడటం ఇకనైనా మానుకోనుకోవాలని, ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణపై అవాకులు చెవాకులు పేలితే నాలుక చీరేస్తామని జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సంపత్ గౌడ్ హెచ్చరించారు. అమాసకో, పున్నానికో వచ్చి పోయే రసమయి వచ్చినప్పుడల్లా ప్రెస్ మీట్లు పెట్టి ఎమ్మెల్యేపై తప్పుడు ఆరోపణలు చేయడం ఆయనకు పరిపాటిగా మారిందని విమర్శించారు. అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్న కవ్వంపల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఇక సహించబోమని, తగిన శాస్తి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. 25 లక్షలకు సింగిల్ విండో చైర్మన్, 5 లక్షలకు వైస్ చైర్మన్ పదవులు ఇప్పించిన రసమయి నీతులు వల్లించడం అసహ్యంగా ఉందని ఆయన ఎద్దేవా చేశారు.

**గోసి గొంగడితో వచ్చిన బాలకిషన్ కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయ్ : కోటి**

గోసి గొంగడితో వచ్చిన రసమయి బాలకిషన్ కోట్ల విలువ చేసే ఆస్తిపాస్తులు ఎలా సంపాదించాడో చెప్పాలని జిల్లా సహకార కేంద్రబ్యాంక్ డైరెక్టర్ అలువాల కోటి డిమాండ్ చేశారు. ఇది ముమ్మాటికీ అక్రమ సంపాదనే తప్ప నీతివంతంగా సంపాధించలేదని ఆయన స్పష్టం చేశారు. అవినీతి అక్రమాలకు పాల్పడే రసమయి అవినీతి గురించి మాట్లాడటం దయ్యాలు వేదాలు వల్లించినట్టుగా, దొంగే దొంగ దొంగ అంటూ అరచినట్టుగా ఉందని ఆయన ఎద్దేవా చేశారు.రసమయి అకృత్యాలను, ఆయన వికృత చేష్టలను దగ్గరగా తాను చూశానని, యాటలకు, కోళ్లకు కక్కుర్తిపడే వ్యక్తి అని ఆయన విమర్శించారు. మానకొండూర్ నియోజవర్గంలో 12 సహకార సంఘాలు ఉన్నాయని, వీటిలో 7 సంఘాల్లో అవినీతి, అక్రమాలు జరిగాయనే ఆరోపణల నేపథ్యంలో ఆ సంఘాల చైర్మన్ల స్థానంలో తాజాగా ప్రత్యేక అధికారులను నియమించడం జరిగిందని కోటి వివరించారు. వాస్తవాలు తెలుసుకోకుండా డబ్బుల కోసం సదరు సంఘాల చైర్మన్లను ఎమ్మెల్యే వేధింపులకు గురి చేస్తున్నట్టుగా రసమయి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. ఎమ్మెల్యేగా ఉన్న పది సంవత్సరాల పాటు రైతుల పాలిట నిర్దయగా వ్యవహరించిన బాలకిషన్ ఇప్పుడు రైతుల గురించి మాట్లాడటం, పంటలు ఎండిపోతున్నాయని గగ్గోలు పెట్టడం విడ్డూరంగా ఉందని ఆయన విమర్శించారు. వర్షాకాలంలో కంటే ఈసారి ఎక్కువ యూరియాను రైతులకు అందించామని, వాస్తవాలు తెలుసుకోకుండా ఎమ్మెల్యేను బదనాం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన విమర్శించారు.

**మోసకారి రసమయి : గంకిడి**

పోరండ్ల సింగిల్ విండో చైర్మన్ గా చేస్తానంటూ తన వద్ద 20 లక్షలు తీసుకొని మోసం చేశారని తిమ్మాపూర్ మాజీ సర్పంచ్ గంకిడి లక్ష్మారెడ్డి ఆరోపించారు. 40 లక్షలు డిమాండ్ చేయగా, తాను 20 లక్షలు మాత్రమే ఇవ్వగలుగుతానని, అది కూడా భూమి అమ్మి ఇవ్వాల్సి ఉంటుందని చెప్పానని, డబ్బులు తీసుకున్న రసమయి తనకు కాకుండా 30 లక్షలు ఇచ్చిన వ్యక్తికి సింగిల్ విండో చైర్మన్ పదవి ఇప్పించారని ఆయన తీవ్రంగా ఆరోపించారు. వంచనలకు పాల్పడే రసమయి నీతులు వల్లించడం విడ్డూరంగా ఉందని ఆయన విమర్శించారు.

**రాజకీయ అజ్ఞాని : బత్తిని**

ఎమ్మెల్యేగా పదేళ్లపాటు కొనసాగిన రసమయి బాలకిషన్ విలువలకు పాతరేశారని, ఆయనో రాజకీయ అజ్ఞాని అని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఆయన ఏనాడూ హుందాగా వ్యవహరించలేదని, తనకు ఉన్న అవలక్షణాలన్నీ ఇతరుల్లో ఉన్నాయనుకొనే భ్రమలో ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి పై తప్పుడు ఆరోపణలతో బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. సహకార సంఘాల్లో గోల్ మాల్ కు పాల్పడిన చైర్మన్లను తప్పిస్తే తప్పేంటని ఆయన సూటిగా ప్రశ్నించారు.

**రసమయికి డబ్బుపైనే యావ ఎక్కువ : ఊట్కూరి**

రసమయికి ప్రజాసేవ కన్నా డబ్బు సంపాదనపైననే యావ ఎక్కువ అని సెస్ మాజీ డైరెక్టర్, ఇల్లంతకుంట మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు ఊట్కూరి వెంకట రమణారెడ్డి విమర్శించారు. డబ్బు కోసం ఏమైనా చేయగలుగుతాయని, ఈ విషయంలో తన,మన అనే తేడాలు, మినహాయింపులు ఉండవని పేర్కొన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఎవరెవరి వద్ద డబ్బులు తీసుకొని పదవులు ఇప్పించారో అందరికీ తెలుసుని, రసమయి చెప్పే మాటలను నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరని ఆయన పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముస్కు ఉపేందర్ రెడ్డి (గన్నేరువరం),బి.రాఘవరెడ్డి (ఇల్లంతకుంట), పార్టీ నాయకులు గోపు మల్లారెడ్డి, కనకం అశోక్, గోపు శ్రీనివాస్ రెడ్డి, మామిడి అనిల్, తుమ్మనపల్లి శ్రీనివాస్ రావు, బండారు రమేశ్, కొత్త తిరుపతిరెడ్డి, చెన్నబోయిన రవి, కుంటి మల్లేశం, ద్యావ శ్రీనివాస్ రెడ్డి, మాడ తిరుపతి రెడ్డి ఒగ్గు దామోదర్, పులి కృష్ణ,అల్లూరి శ్రీనాథ్ రెడ్డి, కొమ్మెర రవీందర్ రెడ్డి, లింగాల మల్లారెడ్డి, ,బొడ్డు సునిల్, మాతంగి అనిల్,పోలు రాము , సాయిరి దేవయ్య, సుధగోని తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## పంజాబ్ పోలీసులకు చిక్కిన
# ఇంటర్నేషనల్ డ్రగ్ లార్డ్



**న్యూఢిల్లీ :** అమెరికా సహా పలు దేశాలకు మాదక ద్రవ్యాలను సరఫరా చేస్తున్న అంతర్జాతీయ డ్రగ్ డీలర్‌ను పంజాబ్ పోలీసులు పట్టుకున్నారు. ఎఫ్‌బీఐ మోస్ట్‌వాంటెడ్ జాబితాలో ఉన్న ఇంటర్నేషనల్ డ్రగ్ లార్డ్ షెహనాజ్ సింగ్ అలియాస్ షాన్ భిందెర్‌ను అరెస్టు చేసినట్లు పంజాబ్ డీజీపీ సామాజిక మాధ్యమాల్లో ప్రకటిం చారు. నార్కోటిక్స్ సిండికేట్‌లో అతడు కీలకంగా వ్యవహరిస్తున్నాడని, కొలంబియా నుంచి అమెరికా, కెనడాలోకి మాదకద్రవ్యాలను స్మగ్లింగ్ చేస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. షెహనాజ్ అక్రమాలపై ప్రత్యేక నిఘా పెట్టిన అమెరికా ఎఫ్‌బీఐ ఫిబ్రవరి 26న అతడి అనుచరులను అరెస్టు చేసింది. వారినుంచి 391 కేజీల మెథంఫెటమైన్, 109 కేజీల కొకైన్ సహా నాలుగు ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ పరిణామాలతో షెహనాజ్ భారత్‌కు పారిపోయి వచ్చాడు. దానిపై నిఘా వర్గాల నుంచి సమాచారం రావడంతో పంజాబ్ తర్న్ తరణ్ పోలీసులు రహస్య ఆపరేషన్ చేపట్టారు. అతడి జాడను గుర్తించి తాజాగా అరెస్టు చేసినట్లు డీజీపీ వెల్లడించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వ్యవస్థీకృత నేరాల కట్టడికి తాము కఠిన చర్యలు తీసుకుంటున్నామని చెప్పేందుకు ఆ ఆపరేషన్ నిదర్శనమని పంజాబ్ పోలీసులు వెల్లడించారు. డ్రగ్ స్మగ్లర్లు, క్రిమినల్స్‌కు పంజాబ్ స్వర్గధామం కాదని హెచ్చరించారు.

## విమానం గగనతలంలో ఉండగా
# బాంబు బెదిరింపులు




**ముంబయి :** ఎయిరిండియా విమానానికి బాంబు బెదిరింపు వచ్చింది. దాంతో ముంబయి నుంచి న్యూయార్క్ వెళ్తున్న విమానాన్ని పైలట్లు టేకాఫ్ అయిన చోటే దింపారు. జాతీయ మీడియా కథనాల ప్రకారం.. బోయింగ్ 777 విమానం ముంబయి నుం చి న్యూయార్క్ వెళ్తోంది. నాలుగు గంటల తర్వాత అజర్‌బైజన్ ప్రాంతంలో గగనతలంలో ఉండగా బెదిరింపులు వచ్చాయి. సిబ్బంది వెంటనే అప్రమత్తమై పైలట్లకు తెలపడంతో వారు ముంబయి వైపు విమానాన్ని మళ్లించారు. అక్కడ ల్యాండ్ అయిన వెంటనే బాంబ్ డిటెక్షన్ స్క్వాడ్ రంగంలోకి దిగి, తనిఖీలు చేపట్టింది. అది నకిలీ కాల్ అని తెలుస్తోంది. విమానంలో సిబ్బందితో కలిపి 322 మంది ప్రయాణికులున్నారు. తనిఖీల అనంతరం మంగళవారం తెల్లవారుజామున తిరిగి న్యూయార్క్ బయల్దేరనున్నట్లు ఎయిరిండియా వెల్లడించింది. గత డిసెంబర్‌లో అజర్ బైజన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన జె2-8243 విమానం ప్రమాదానికి గురికావడంతో 38 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. బాకు నుంచి రష్యాలోని చెచెన్ ప్రాంతానికి చెందిన గ్రోజ్నికి ప్రయాణిస్తుండగా కజకిస్థాన్‌లోని అక్టౌలో అది కూలిపోయింది. రష్యా క్షిపణి తాకడం వల్ల విమానం కూలిందంటూ అప్పట్లో ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా జరిగిన ఈ ఘటన ఆందోళన కలిగించింది. ఇక ఇటీవల ఎయిరిండియా తరచూ వార్తల్లో నిలుస్తోంది. విమానాశ్రయంలో ఓ వృద్ధురాలికి వీల్‌ఛైర్ సదుపాయం కల్పించకపోవడంతో నడుచుకుంటూ వెళ్లిన ఆమె కిందపడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. తాము బుక్ చేసుకున్నప్పటికీ.. ఎయిరిండియా సిబ్బంది ఛైర్ ఇవ్వలేదని ఆమె బంధువులు ఆరోపించారు. ఇక షికాగో నుంచి దిల్లీకి బయల్దేరిన విమానంలో టాయిలెట్లు మూసుకుపోవడంతో.. 10 గంటల ప్రయాణం అనంతరం విమానం వెనక్కి మళ్లిన సంగతి తెలిసిందే.

## మాజీ సీఎం కుమారుడి నివాసంలో ఈడీ సోదాలు



**ఛత్తీస్‌గఢ్ :** ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం భూపేశ్ భగేల్ కుమారుడు చైతన్య నివాసంలో సోమవారం ఈడీ సోదాలు నిర్వహించింది. మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో భాగంగా ఈ తనిఖీలు జరిగాయని సంబంధిత అధికారులు వెల్లడించారు. మొత్తం 15 ప్రాంగణాల్లో సోదాలు జరిగాయి. వాటిలో భిలాయి ప్రాంతంలో ఉన్న చైతన్య భగేల్ నివాసం కూడా ఉంది. ఈ తనిఖీల నేపథ్యంలో భగేల్ కార్యాలయం నుంచి స్పందన వచ్చింది. "ఏడు సంవత్సరాలు నడిచిన తప్పుడు కేసును కోర్టు కొట్టివేసింది. కానీ ఇప్పుడు ఈడీ అతిథులు వచ్చి భగేల్ నివాసంలో తనిఖీలు చేశారు" అని మండిపడింది. ఛత్తీస్‌గఢ్ మద్యం కుంభకోణంతో రాష్ట్ర ఖజానాకు భారీ నష్టం వాటిల్లిందని ఆరోపణలు ఉన్నాయి. మద్యం సిండికేట్‌కు రూ.రెండువేల కోట్ల మేర లబ్ధి చేకూరిందని ఈడీ గతంలో పేర్కొంది. దర్యాప్తులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో పాటు వ్యాపారవేత్తలను అరెస్టు చేసింది.



## జాతీయ విద్యా విధానంపై ఆందోళన

**న్యూఢిల్లీ :** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జాతీయ విద్యా విధానాన్ని తమిళనాడు అధికార పార్టీ డీఎంకే వ్యతిరేకిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ అంశాన్ని లోక్‌సభలో డీఎంకే ఎంపీలు లేవనెత్తడంతో గందరగోళ వాతావరణం నెలకొంది. ఎంపీల చర్యపై స్పందించిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మండిపడ్డారు. దీంతో స్పీకర్ ఓం బిర్లా సభను వాయిదా వేసి.. తిరిగి ప్రారంభించారు. కొత్త విద్యా విధానాన్ని తమిళనాడులో అమలుచేయడంపై డీఎంకే ఎంపీలు నిరసిస్తూ వెల్ వైపు వెళ్లడంతో కేంద్రమంత్రి ఆగ్రహం వ్యక్తంచేశారు. జాతీయ విద్యావిధానంపై చేసిన ఆరోపణలను ఆయన తిప్పికొట్టారు. "విద్యార్థుల భవిష్యత్తుతో డీఎంకే చెలగాటమాడుతోంది. వారంతా నిజాయతీ లేనివారు. విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఇచ్చేందుకు డీఎంకే సిద్ధంగా లేదు. భాష పరమైన వివాదాలు సృష్టించడమే వారు పనిగా పెట్టుకున్నట్లున్నారు. రాజకీయాలు చేస్తున్నారు. వారి చర్యలు ప్రజాస్వామ్య వ్యతిరేకం" అని ఆరోపించారు.

**ఓటరు జాబితాపై చర్చ జరగాలి: రాహుల్**

ఈక్రమంలోనే స్పీకర్ సభను వాయిదా వేసి తిరిగి ప్రారంభించారు. ప్రధాన్ వ్యాఖ్యలపై డీఎంకే నిరసన వ్యక్తంచేసింది. అనంతరం ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మాట్లాడారు. ఓటరు జాబితాలో అవకతవకలు జరిగాయన్న అంశాన్ని ఆయన లేవనెత్తారు. దీనిపై దేశవ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. "ఓటరు జాబితాపై దేశవ్యాప్తంగా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ జాబితాపై చర్చలు జరగాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి" అని కాంగ్రెస్ అగ్రనేత పేర్కొన్నారు.

## భారత్‌తో సంబంధాలు
# మెరుగుపరచుకుంటాం : కెనడా




**కెనడా :** కెనడా అధికార లిబరల్ పార్టీ నూతన నేతగా ఎన్నికయిన మార్క్ కార్నీ భారత్-కెనడా సంబంధాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. ట్రూడో అధికారంలో ఉన్న సమయంలో భారత్‌తో దెబ్బతిన్న సంబంధాలను తిరిగి పునరుద్ధరిస్తానన్నారు. తాను అధికారంలోకి వచ్చిన వెంటనే ఆవిధంగా కృషి చేయడానికి ఎదురుచూస్తున్నానని పేర్కొన్నారు. న్యూదిల్లీతోనే కాకుండా సారూప్యత కలిగిన దేశాలతోనూ వాణిజ్య సంబంధాలను బలోపేతం చేయడానికి తగిన చర్యలు తీసుకుంటానని తెలిపారు. భారత్‌పై తన వైఖరిని ఇదివరకే ఓ ఇంటర్వ్యూలో ఆయన స్పష్టంచేసిన విషయం తెలిసిందే. తాజా వ్యాఖ్యలు ఆయనకు భారత్‌పై ఉన్న సానుకూల ధోరణిని వ్యక్తపరుస్తున్నాయి. దశాబ్దాల తరబడి మిత్రదేశాలుగా ఉన్న భారత్, కెనడాల మధ్య సంబంధాలు ఇటీవల బాగా దెబ్బతిన్నాయి. కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో నిరుడు తమ పార్లమెంటులో మాట్లాడుతూ.. ఖలిస్థానీ ఉగ్రవాది హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్య వెనక భారత్ ఏజెంట్ల హస్తం ఉండొచ్చని చేసిన వ్యాఖ్యలు ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు రాజేశాయి. భారత్ వెంటనే వాటిని తిప్పికొట్టింది. అనంతరం ఇరుదేశాలు పరస్పరం దౌత్యవేత్తలను తిప్పి పంపివేశాయి. ఆ క్రమంలోనే వరసగా జరిగిన కొన్ని పరిణామాలతో ఉభయదేశాల దౌత్య, వాణిజ్య సంబంధాలు క్షీణించాయి. ఈనేపథ్యంలో కెనడాకు నూతన ప్రధానిగా అధికార లిబరల్ పార్టీ నేత మార్క్ కార్నీ ఎన్నికవ్వడం.. ఆయన భారత్‌కు అనుకూలంగా ఉండడంతో భవిష్యత్తులో ఇరుదేశాల మధ్య సంబంధాలు మెరుగయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# లలిత్ మోదీకి షాక్.. వనాటు పౌరసత్వం రద్దు?



**ముంబయి :** ప్రపంచంలోనే అత్యంత సంపన్న క్రికెట్ లీగ్ అయిన ఐపీఎల్ వ్యవస్థాపకుడు, మాజీ ఛైర్మన్ లలిత్ మోదీ పసిఫిక్ ద్వీప దేశమైన వనాటుకు మకాం మార్చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. దీనికోసం ఆ దేశానికి చెందిన గోల్డెన్ పాస్‌పోర్టును తీసుకున్నట్లు సమాచారం. కాగా ఆయనకు జారీ చేసిన పౌరసత్వాన్ని రద్దు చేయాలని వనాటు ప్రధాని జోథం నపాట్ పౌరసత్వ కమిషన్‌ను ఆదేశించినట్లు అధికారులు వెల్లడించారు. "దరఖాస్తు సమయంలో నిర్వహించిన ఇంటర్‌పోల్ స్క్రీనింగ్‌లతో సహా అన్ని ప్రామాణిక నేపథ్య తనిఖీలలో లలిత్ మోదీపై ఎటువంటి నేరారోపణలు లేవని తేలింది. అయితే గత 24 గంటల్లో ఆయనపై హెచ్చరిక నోటీసు జారీ చేయాలని భారత అధికారులు ఇంటర్‌పోల్‌కు రెండుసార్లు అభ్యర్థనలు చేసినట్లు మాకు తెలిసింది. అయితే తగిన ఆధారాలు లేనందువల్ల వారి అభ్యర్థనలను ఇంటర్‌పోల్ తిరస్కరించింది. వనాటు పౌరసత్వం పొందడానికి చట్టబద్ధమైన కారణాలు ఉండాలి. స్వదేశంలో దర్యాప్తును తప్పించుకోవడానికి అతడు వనాటు పౌరసత్వం తీసుకున్నాడని తెలుస్తోంది. అతడు చూపిన కారణం చట్టబద్ధంగా లేకపోవడంతో లలిత్ పౌరసత్వం రద్దు చేయాలని నిర్ణయించుకున్నాం" అని వనాటు ప్రధాని పేర్కొన్నారు. లలిత్ మోదీ వనాటు పౌరసత్వం తీసుకున్న నేపథ్యంలో తన భారత పాస్‌పోర్టును అప్పగించేందుకు లండన్‌లోని రాయబార కార్యాలయంలో ఇటీవల దరఖాస్తు చేసుకున్నాడు. దీనిపై విదేశాంగ మంత్రిత్వశాఖ స్పందిస్తూ.. దానిని నిబంధనల ప్రకారం అధికారులు పరిశీలిస్తున్నారని పేర్కొంది. అతడిపై ఉన్న కేసును చట్ట ప్రకారం కొనసాగిస్తామని తెలిపింది. లలిత్ మోదీ ఐపీఎల్‌కు బాస్‌గా ఉన్న సమయంలో కోట్లాది రూపాయలు దుర్వినియోగం చేశాడని అతడిపై ఆరోపణలు ఉన్నాయి. దీంతో భారత అధికారులకు దొరకకుండా గత 15 ఏళ్లుగా లండన్‌లో తల దాచుకున్నాడు. అతడిని తిరిగి స్వదేశానికి తప్పించేందుకు భారత్ ప్రయత్నాలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో లలిత్ పసిఫిక్ ద్వీప దేశమైన వనాటుకు మకాం మార్చడానికి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఎందుకంటే వనాటులో వ్యాపార సంస్థను రిజిస్టర్ చేసుకొని.. దేశం బయటి నుంచి ఆదాయాన్ని పొందినా, ఎలాంటి ఇబ్బందీ ఉండదు. అలాగే గిఫ్ట్ , ఎస్టేట్ ట్యాక్స్‌లు లేవు. అంతేగాకుండా ఆ దేశం క్రిప్టో హబ్‌గా వృద్ధి చెం దుతోంది. స్థానికంగా, అంతర్జాతీయంగా వచ్చే ఆదాయంతో సంబంధం లేకుండా దేనిపైనా అక్కడ ఆదాయపన్ను ఉండదు. దీర్ఘకాలిక లాభాలపై పన్ను కూడా ఉండదు. ముఖ్యంగా స్టాక్స్, రియల్ ఎస్టేట్ వంటి వ్యాపారాలు చేసేవారికి ప్రయోజనకరంగా ఉంటుంది.

# కెనడా ఎన్నటికీ అమెరికాలో భాగం కాబోదు

## మార్క్ కార్నీ




**కెనడా :** కెనడాలో అధికార లిబరల్ పార్టీ నేతగా మార్క్ కార్నీ ఎన్నికయ్యారు. దీంతో తదుపరి ప్రధానిగా ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో ఓ మీడియా సమావేశంలో ప్రసంగిస్తూ.. కెనడాను తమ దేశంలో 51వ రాష్ట్రంగా చేర్చుకుంటామని పలు సందర్భాల్లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన బెదిరింపులపై స్పందించారు. ఒట్టావా ఏవిధంగానూ.. ఏరూపంలోనూ అమెరికాలో భాగం కాదని ఆయన వ్యాఖ్యానించారు. తమ దేశం అప్పటికీ, ఇప్పటికీ బలంగా ఉందన్నారు. వాణిజ్యం అయినా, క్రీడలు అయినా చివరికి విజయం సాధించేది కెనడాయేనని అని పేర్కొన్నారు. "కెనడాను తమలో కలుపుకొని.. దేశంలో ఉన్న వనరులు, నీరు, భూమి వంటి వాటిని తమ స్వాధీనం చేసుకోవాలనే ఉద్దేశంతో అగ్రరాజ్యం ఉంది. ఈ విషయంలో వారు విజయం సాధిస్తే, మన జీవన విధానాన్ని పూర్తిగా నాశనం చేస్తారు. కాబట్టి ట్రంప్‌ను ఎప్పటికీ ఈ విషయంలో విజయం సాధించనివ్వను. వాషింగ్టన్ ఒట్టావాతో స్వేచ్ఛ, న్యాయమైన వాణిజ్యంపై విశ్వసనీయమైన నిబద్ధత చూపించేవరకు అమెరికాపై ప్రతీకార చర్యలు కొనసాగుతాయి" అని కార్నీ అన్నారు. కెనడాను అంధకారంలో తోయడానికి ప్రయత్నించినందుకుగాను అక్కడి ప్రజలు ఇకపై ఎప్పటికీ అమెరికాను నమ్మరని కార్నీ పేర్కొన్నారు. ఇప్పుడే అగ్రరాజ్యం ఇచ్చిన షాక్ నుంచి తాము బయటపడుతున్నామని.. కానీ ఈ పాఠాలను తామెన్నటికీ మర్చిపోమని అన్నారు. రాబోయే కఠినమైన రోజుల్లో నాయకులు, ప్రజలు ఒకరికి ఒకరు సహకరించుకుంటూ, కలిసికట్టుగా ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. అందరి సహకారంతోనే కెనడా సంక్షోభాలను అధిగమిస్తుందని అన్నారు. అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం కెనడా, మెక్సికోలపై 25 శాతం సుంకం విధించే ఆర్డర్లపై డొనాల్డ్ ట్రంప్ సంతకం చేశారు. అంతేకాక వలసలు, డ్రగ్స్ అక్రమ రవాణాను సరిహద్దుల్లోనే కట్టడి చేయడంలో విఫలమైతే అమెరికాలో 51వ రాష్ట్రంగా కెనడా చేరాలని ట్రూడోకు చురకలు అంటించారు. ఈ సుంకాల విధింపును నెల రోజుల పాటు నిలిపివేయగా.. తాజాగా మార్చి 4 నుంచి ఇవి అమల్లోకి వచ్చాయి. దీనికి ప్రతిగా ట్రూడో సైతం ప్రతీకార సుంకాలు ప్రకటించారు. అతడి తీరుపై సొంత పార్టీ నుంచి వ్యతిరేకత రావడంతో తన పదవి నుంచి వైదొలగుతున్నట్లు జనవరిలో ప్రకటించారు. తాజాగా నిర్వహించిన ఎన్నికల్లో అధికార లిబరల్ పార్టీ నేతగా మార్క్ కార్నీ ఎన్నికయ్యారు.

# సిరియాలో ప్రతీకార హత్యలు



**సిరియా :** సిరియాలో అంతర్యుద్ధం తీవ్ర స్థాయిలో జరుగుతున్నట్లు నివేదికలు వస్తున్నాయి. గత 48 గంటల్లోనే 745 ప్రతీకార హత్యలు చోటుచేసుకొన్నాయి. చాలా ప్రాంతాల్లోని మైనార్టీలైన అలావైట్లను అణచివేసే దిశగా ఈ దాడులు జరుగుతున్నాయి. గురువారం అసద్ మద్దతుదారులపై హెచ్‌టీఎస్ ప్రభుత్వానికి అనుకూల సాయుధులు దాడులు చేయడంతో ఘర్షణలు మొదలయ్యాయి. ఈక్రమంలో అసద్ మద్దతుదారులను వెతికి మరీ చంపుతున్నట్లు ఓ బాధితుడు వెల్లడించాడు. వీధుల్లో శవాలు పడి ఉన్నాయని.. మగవారిని ఇళ్ల పైకప్పు మీదకు చేర్చి కాల్చేస్తున్నారని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. బనియాస్ అనే ప్రాంతంలో రోహిబ్ కమెల్ అనే వ్యక్తి కుటుంబంతో కలిసి బాత్రూమ్‌లో దాక్కొని ప్రాణాలు కాపాడుకొన్నాడు. ఈ విషయాన్ని అతడే ఓ ఆంగ్ల వార్తా సంస్థకు వెల్లడించాడు. "మా పొరుగు వారిపై సాయుధ మిలిటెంట్లు దాడులు చేస్తుండటంతో.. మేము లైట్లు ఆర్పేసి.. దాక్కొన్నాము. వీధుల్లో మృతదేహాలున్నాయి. ఈ పిల్లలు ఏం తప్పు చేశారు. అసద్ పాలన అంతం కావడానికి వీరు కూడా మద్దతు పలికారు" అని కమెల్ వెల్లడించాడు. ఇక సమీర్ హైదర్ అనే బాధితుడు మాట్లాడుతూ తన ఇంటిలోకి సాయుధులు చొచ్చుకొచ్చి తన ఇద్దరు సోదరులు, అల్లుడిని హత్య చేసినట్లు వెల్లడించాడు. వాస్తవానికి అతడు అలావైట్ వర్గానికి చెందినా.. సుదీర్ఘకాలంగా అసద్‌ను వ్యతిరేకిస్తూ వచ్చాడు. దాదాపు పదేళ్లు జైల్లో గడిపాడు. ఇక రేవు నగరమైన లటాకియాలో పరిస్థితి ఘోరంగా ఉంది. అక్కడ ప్రభుత్వ సాంస్కృతిక కేంద్రం అధిపతి యాసిర్ సబౌహ్‌ను గుర్తుతెలియని దుండగులు కాల్చి చంపారు. అతడి ఇంటి ఎదుటే మృతదేహాన్ని పడేశారు. ఈ తీర ప్రాంత నగరంలో అలావైట్లు అత్యధికంగా ఉంటారు. ప్రస్తుతం అక్కడే అత్యధిక హింస చోటుచేసుకుంటోంది. మొత్తంగా మార్చి 6 నుంచి ఈ హింసలో 973 మంది ప్రాణాలు కోల్పోయినట్లు సిరియన్ అబ్జర్వేటరీ ఫర్ హ్యూమన్ రైట్స్ వెల్లడించింది. మరోవైపు దేశంలో తాజాగా చెలరేగిన హింసపై దర్యాప్తు చేస్తామని ఆ దేశ తాత్కాలిక అధ్యక్షుడు అహ్మద్ అల్‌షారా ఓ వీడియో సందేశంలో పేర్కొన్నారు. అదే సమయంలో అసద్ వర్గానికి చెందినవారు, విదేశీ శక్తుల కారణంగానే ఈ పరిస్థితి తలెత్తిందని ఆరోపించారు. ప్రస్తుతం తాము సంక్లిష్ట పరిస్థితిలో ఉన్నామన్నారు. సరికొత్త ముప్పును తాము ఎదుర్కొంటున్నామన్నారు. తమ దేశాన్ని అంతర్యుద్ధం దిశగా లాగుతున్నారన్నారు.

# జెలెన్‌స్కీకి కృతజ్ఞత లేదు : ట్రంప్




**ఫ్లోరిడా :** తమ దేశం నుంచి వందల బిలియన్ల డాలర్లు తీసుకొన్నా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి కృతజ్ఞత లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి విరుచుకుపడ్డారు. ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. చాక్లెట్ లాక్కొన్నంత తేలిగ్గా అమెరికా నుంచి సొమ్మును జెలెన్‌స్కీ తీసుకొన్నట్లు అభివర్ణించారు. "అతను (ఉక్రెయిన్ అధ్యక్షుడు) పసిబిడ్డ నుంచి చాక్లెట్ లాక్కొన్నంత తేలిగ్గా బైడెన్ సర్కారు నుంచి సొమ్ములు తీసుకొన్నారు. ఇక రష్యా విషయంలో అత్యంత కఠినంగా ఉన్న అధ్యక్షుడిని నేను. దాని పైప్‌లైన్ ఆపి ఆంక్షలు విధించాను. జావెలిన్ క్షిపణులు అందజేశాను. కానీ, పుతిన్‌తో కూడా మంచి సంబంధాలున్నాయి. రష్యా విషయంలో నన్ను మించి కఠినంగా ఎవరూ లేరు" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. మరోవైపు ఉక్రెయిన్ వీలైనంత తొందరగా యుద్ధం ముగించాలన్న ఒత్తిళ్లు డోజ్ సారథి మస్క్ వైపు నుంచి కూడా పెరిగాయి. తాజాగా తాను స్టార్ లింక్ ఇంటర్నెట్ సేవలను నిలిపేస్తే కీవ్ సేనలు కుప్పకూలుతాయని ఆయన హెచ్చరించారు. అదే సమయంలో ఉక్రెయిన్ ఓటమి అనివార్యమని వ్యాఖ్యానించారు. వాస్తవికతతో ఆలోచించేవారు, అర్థం చేసుకునేవారు ఎవరైనా ఈ యుద్ధాన్ని ఆపాలని కోరుకుంటారని వ్యాఖ్యానించారు. ఆ తర్వాత ట్రంప్ తాజా కామెంట్లు రావడం గమనార్హం. ఇటీవల ఖనిజాల ఒప్పందం కోసం అమెరికాలోని శ్వేతసౌధానికి వచ్చిన జెలెన్‌స్కీ అక్కడ వాగ్వాదం జరగడంతో సంతకాలు చేయకుండానే వెళ్లిపోయారు. ఆ తర్వాత అమెరికా నుంచి కీవ్‌కు సైనిక, ఇంటెలిజెన్స్ సాయాలు నిలిచిపోయాయి. మరోవైపు ఇదే అదునుగా రష్యా దాడులను తీవ్రతరం చేసింది. ఇక ట్రంప్ తొలిసారి అధికారంలో ఉన్న సమయంలో రష్యా గ్యాస్ పైప్‌లైన్‌పై ఆంక్షలు విధించారు. వాస్తవానికి దీనినుంచి ఐరోపాలోని జర్మనీకి గ్యాస్ సరఫరా అవుతుంది.

# ట్రంప్ నివాసం వద్ద భద్రతా వైఫల్యం
## ఆంక్షల వలయంలోకి ప్రైవేటు విమానం

**ఫ్లోరిడా :** అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్ సమీపంలో ఇటీవల ఓ అనుమానితుడి కదలికలు కలకలం సృష్టించిన సంగతి తెలిసిందే. దాంతో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సిబ్బంది భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. ఈ క్రమంలో తాజాగా మరోసారి భద్రతా వైఫల్యం చోటుచేసుకోవడం గమనార్హం. ఆదివారం (అమెరికా కాలమానం ప్రకారం) ఫ్లోరిడాలోని ట్రంప్ నివాసం సమీపంలో అమల్లో ఉన్న ఆంక్షలు ఉల్లంఘనకు గురైనట్లు తెలుస్తోంది. ఆ భవనం దిశగా ఒక పౌర విమానం దూసుకొచ్చింది. దానిని గమనించిన వైమానిక దళం అడ్డుకుంది. ట్రంప్ తన వెస్ట్ పామ్ బీచ్‌లో గోల్ఫ్ ఆడుతున్నప్పుడు ఈ ఘటన జరిగిందని నార్త్ అమెరికన్ ఏరోస్పేస్ డిఫెన్స్ కమాండ్ ఒక ప్రకటనలో తెలిపింది. ఆంక్షలు ఉన్న ప్రాంతంలోకి వచ్చిన ప్రైవేటు విమానాన్ని ఎఫ్-16 విమానాలు అడ్డుకున్నాయి. శనివారం ఉదయం కూడా ఇలాగే మరో పౌర విమానాన్ని జెట్స్ నిలువరించాయి. ఈ పరిణామాల వేళ ప్రైవేటు విమానాల పైలట్‌లు ఆంక్షలను పట్టించుకోవడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలాఉంటే.. వైట్‌హౌస్ సమీపంలో అనుమానితుడి కదలికల గురించి స్థానిక పోలీసులు సీక్రెట్ సర్వీస్‌కు సమాచారం అందించారు. దాంతో అధికారులు అప్రమత్తమయ్యారు. అధ్యక్ష భవనానికి కొంత దూరంలో పార్క్ చేసిన ఒక వాహనాన్ని గుర్తించారు. సమీపంలో ఓ వ్యక్తి నడిచి వెళుతుండగా.. అతడి వద్దకు చేరుకునేందుకు ప్రయత్నించారు. అధికారులు రావడాన్ని గమనించిన అతడు వెంటనే తన వద్ద ఉన్న తుపాకీ బయటకు తీశాడు. అతడిని అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నిస్తుండగా వారి మధ్య ఘర్షణ చోటుచేసుకొంది. అతడు కాల్పులు జరిపేందుకు యత్నిస్తుండగా.. సిబ్బంది నిందితుడిపై కాల్పులు జరిపారు. ఆ సమయంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఫ్లోరిడాలో ఉన్నారు. గాయపడిన నిందితుడిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతోంది.



## కరేబియన్ దేశంలో
# భారత సంతతి విద్యార్థిని మిస్సింగ్

**ప్యూర్టో రికో:** స్నేహితులతో కలిసి కరేబియన్ దేశానికి విహారయాత్రకు వెళ్లిన ఓ భారత సంతతి విద్యార్థిని అక్కడ అదృశ్యమైంది. అమెరికాలోని పిట్స్‌బర్గ్ యూనివర్సిటీలో చదువుతున్న సుదీక్ష కోణంకి.. గతవారం డొమినికన్ రిపబ్లికన్ లోని ఓ బీచ్ వద్ద కన్పించకుండా పోయింది. దీంతో ఆమె కోసం ముమ్మర గాలింపు చేపట్టారు. 20 ఏళ్ల సుదీక్ష కోణంకి వర్జీనియాలో నివాసం ఉంటున్నారు. గతవారం మరో ఐదుగురు అమ్మాయిలతో కలిసి డొమినికన్ రిపబ్లిక్‌లోని ప్రముఖ పర్యటక పట్టణమైన ప్యూంటా కానా ప్రాంతానికి వెకేషన్‌కు వెళ్లారు. మార్చి 6వ తేదీన స్థానికంగా ఉన్న రియూ రిపబ్లికా రిసార్ట్ వద్ద బీచ్ వెంట నడుచుకుంటూ కన్పించింది. ఆ తర్వాత ఆమె తిరిగి రాకపోవడంతో స్నేహితులు పోలీసులను సంప్రదించారు. అప్రమత్తమైన పోలీసులు వెంటనే గాలింపుచర్యలు చేపట్టారు. డ్రోన్లు, హెలికాప్టర్లతో గత నాలుగు రోజులుగా ఆమె కోసం వెతుకుతున్నారు. ఇప్పటివరకు ఏ ఆచూకీ లభించకపోవడంతో బహుశా ఆమె బీచ్‌లో కొట్టుకుపోయి ఉండొచ్చని అనుమానిస్తున్నారు. సముద్రంలో గాలింపు చేపట్టినట్లు తెలిపారు. భారత్‌కు చెందిన సుదీక్ష తల్లిదండ్రులు అమెరికాకు వలస వెళ్లి అక్కడ శాశ్వత నివాస హోదా పొందారు. ప్రస్తుతం పిట్స్‌బర్గ్ యూనివర్సిటీలో గ్రాడ్యుయేషన్ చదువుతోంది.

## జర్మనీ ఎయిర్‌పోర్టుల్లో సమ్మె.. 3400 విమానాలు రద్దు

**బెర్లిన్:** జర్మనీలోని విమానాశ్రయాల్లో పనిచేస్తున్న ఉద్యోగ, కార్మిక సంఘాలు ఒకరోజు సమ్మెకు పిలుపునిచ్చాయి. దీంతో ఫ్రాంక్‌ఫర్ట్, మ్యూనిక్ సహా ప్రధాన నగరాల్లోని ఎయిర్‌పోర్టుల్లో విమాన సర్వీసులపై ప్రభావం పడింది. వేలాది విమాన సర్వీసులు రద్దయ్యాయి. మొత్తంగా 5 లక్షల మంది ప్రయాణికులపై ప్రభావం పడనున్నట్లు అంచనా. ఒక్క ఫ్రాంక్‌ఫర్ట్ ఎయిర్‌పోర్టు నుంచి 1116 విమానాలు రాకపోకలు సాగిస్తుండగా ఇందులో 1054 సర్వీసులు రద్దయినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. బెర్లిన్ నుంచి నడిచే విమానాలన్నీ రద్దయ్యాయి. హాంబర్గ్‌లోనూ అదే పరిస్థితి. విమాన సర్వీసులు రద్దైనట్లు కొలోన్ ఎయిర్‌పోర్టు ప్రకటించగా.. సమ్మె కారణంగా విమాన సర్వీసుల సంఖ్య భారీగా తగ్గినట్లు మ్యూనిక్ విమానాశ్రయ అధికారులు ప్రయాణికులకు తెలిపారు. మొత్తంగా 3400 విమాన సర్వీసులు రద్దయ్యే అవకాశం ఉందని జర్మనీ ఎయిర్‌పోర్టు ఆపరేటర్స్ అసోసియేషన్ అంచనా వేసింది. దాదాపు 5లక్షల మంది ప్రయాణికులపై ఇది ప్రభావం చూపనున్నట్లు పేర్కొంది. వేతనాలు పెంచాలని ప్రభుత్వ ఉద్యోగులు డిమాండ్ చేస్తుండగా.. పని ప్రదేశంలో షరతులు సహా అదనపు సమయానికి ఎక్కువ మొత్తంలో బోనస్ ఇవ్వాలని కోరుతూ విమానాశ్రయాల్లో పనిచేసే సిబ్బంది, కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. అయితే, వారి డిమాండ్లను పరిష్కరించలేమంటూ ఆయా యాజమాన్యాలు చేతులెత్తేస్తున్నాయి. ఈ క్రమంలో ఇటీవల జరిపిన చర్చలు విఫలం కావడంతో ఉద్యోగ, కార్మిక సంఘాలు ఒకరోజు సమ్మెకు దిగాయి. ఈ నెల చివర్లో మరోసారి చర్చలు జరిగే అవకాశం కనిపిస్తోంది.



## వ్యక్తిగత గణాంకాలను లెక్క చేయడు..

కెరీర్‌లో ఏ బ్యాటర్‌కు సాధ్యం కానివిధంగా మూడు వన్డే డబుల్ సెంచరీలు చేసిన రోహిత్ కెప్టెన్‌గా పూర్తిగా జట్టుకు అంకితమయ్యాడు. ముఖ్యంగా ఐసీసీ టోర్నీల్లో అతడు గణాంకాలను పట్టించుకోకుండా విజయం కోసమే ఆడటం మొదలుపెట్టాడు. ఇన్నింగ్స్ ఓపెనింగ్ చేసి.. ప్రత్యర్థి బౌలర్ల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీయడం అతడి నైజం. ముఖ్యంగా 2023 వన్డే ప్రపంచకప్‌లో అతడు ఆడిన 11 మ్యాచ్‌ల్లో ఐదుసార్లు 40ల్లో వికెట్ సమర్పించుకొన్నాడు. అయినా.. ఒక శతకం, రెండు అర్ధశతకాలు వచ్చాయంటే ఏ స్థాయిలో ఆడాడో అర్థం చేసుకోవచ్చు. ఆ టోర్నీలో ఏకంగా 597 పరుగులు చేశాడు. ఈ ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్స్‌లో తన వైఖరికి పూర్తి విరుద్ధంగా 83 బంతుల్లో 76 పరుగులు చేశాడు. ఓపిగ్గా పిచ్‌పై ఎక్కువ సేపు ఉండేందుకు యత్నించాడు. ఇక తాను ఫామ్‌లో లేనని.. బోర్డర్ గావస్కర్ ట్రోఫీలో సిడ్నీ టెస్ట్ నుంచి స్వచ్ఛందంగా వైదొలగి బెంచ్‌పై కూర్చోవడం రోహిత్‌కే చెల్లింది. అదే హిట్‌మ్యాన్ దుబాయ్‌లో జరిగిన ఫైనల్స్‌లో నిలబడి విజయం అందించాడు. వ్యక్తిగత గణాంకాలకు దూరంగా ఉంటూ విజయాలను అందించే విషయంలో మిగిలిన ఆటగాళ్లకు ఆదర్శంగా నిలిచాడు. ఆ తర్వాత నుంచే టీమ్ ఇండియాలో 'సెల్ఫ్‌లెస్' ప్లే వైఖరి మెరుగుపడింది. ఈ సిరీస్‌లో శ్రేయస్, కేఎల్ రాహుల్, అక్షర్, హార్దిక్ బ్యాటింగ్‌ల్లో ఇది స్పష్టంగా కనిపించింది. జట్టులో ఫిట్‌నెస్‌పై ఆసక్తిని మాజీ కెప్టెన్ కోహ్లీ పెంచాడు. అలానే సెల్ఫ్‌లెస్' ఆటను రోహిత్ ముందుకు తీసుకెళ్లాడు.

# ఒత్తిడిలో చెక్కు చెదరడు

## కెప్టెన్సీలో సరికొత్త ప్రమాణాలను పరిచయం చేసిన రోహిత్

- వ్యూహాలపై జట్టుకు స్పష్టత..
- వ్యక్తిగత గణాంకాలను లెక్క చేయని హిట్ మ్యాన్

వ్యూహరచనలో 'షానా'..(తెలివైనవాడు).. ఇది రోహిత్ శర్మ జట్టులోకి వచ్చిన తొలినాళ్లలో అతడికి టీమ్ ఇండియా సీమర్ జహీర్‌ఖాన్ పెట్టిన నిక్‌నేమ్..! వాస్తవానికి ఆటగాడిగా పరిపక్వత చెందేకొద్దీ రోహిత్‌కు ఈ పేరు అతికినట్లు సరిపోతుంది. ఐసీసీ వన్డే ప్రపంచకప్.. టీ20 వరల్డ్‌కప్.. ఛాంపియన్స్ ట్రోఫీ.. మూడు మెగా టోర్నీల్లో కలిపి భారత్‌కు ఒక్కటే ఓటమి..! వరుసగా మూడుసార్లు ఫైనల్స్‌కు చేర్చడమే కాదు.. అందులో రెండుసార్లు జట్టుకు టైటిల్స్‌ను అందించడం అంటే వండరే..! భారత క్రికెట్ కెప్టెన్సీలో సరికొత్త ప్రమాణాలను రోహిత్ పరిచయం చేశాడు.

### వ్యూహాలపై జట్టుకు స్పష్టత..

రోహిత్ శర్మ నాయకత్వంలో వ్యూహాల విషయంలో భారత జట్టు మిగిలిన టీమ్‌లకు అందనంత దూరంలో ఉంది. మైదానంలో ఏం చేయాలి.. బ్యాటింగ్ ఆర్డర్‌లో ఎవరి పాత్ర ఏమిటీ అనే దానిపై సభ్యులకు క్లారిటీ ఉంటుంది. ప్రస్తుత జట్టు బ్యాటింగ్ ఆర్డర్‌లో అక్షర్‌ను పైకి తేవడం.. రాహుల్‌ను ఫినిషర్‌గా దింపడం వంటివి దీనిలో భాగమే. ఈ వ్యూహం పనిచేసి టోర్నీలో రాహుల్ 41లి, 23, 42లి, 34లి అద్భుతమైన ముగింపులను ఇచ్చాడు. రోహిత్ గంటలకొద్దీ ప్రత్యర్థి ఆటగాళ్ల వీడియోలు చూస్తూ గడుపుతాడు. వారి లోపాలు.. బలహీనతల ఆధారంగా తన వ్యూహరచనకు పదును పెట్టుకొంటాడు. కాకపోతే.. తాను చూసింది.. మనసులో అనుకొంది మొత్తం చెప్పి బౌలర్లను గందరగోళానికి గురిచేయకుండా సూటిగా సుత్తి లేకుండా చెప్పడం రోహిత్ స్టైల్.

### ఒత్తిడిలోనూ చెక్కు చెదరడు..

రోహిత్ మైదానంలో ఒత్తిడిని కనిపించనీయడు. జట్టు ఓటమి అంచున ఉన్నా.. గెలుపునకు చివరివరకు ప్రయత్నించడం అతడి స్టైల్. 2018 ఆసియాకప్ ఫైనల్‌లో బంగ్లాదేశ్‌పై చివరి బంతికి జట్టు విజయం సాధించింది. ఇక టీ20 ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్ దీనికి ఉదాహరణ. స్టబ్స్, మిల్లర్, క్లాసన్ నిలకడగా దక్షిణాఫ్రికాను విజయం వైపు నడిపిస్తున్న వేళ హార్దిక్‌ను రంగంలోకి దించి ఫలితం రాబట్టాడు. 15వ ఓవర్ తర్వాత నుంచి మ్యాచ్‌పై పట్టుబిగించి దక్షిణాఫ్రికాను కుప్పకూల్చాడు. ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్స్‌లో రచిన్-యంగ్ జోడీ బలపడుతున్నవేళ పరిస్థితి చేజారక ముందే.. మిస్టరీ స్పిన్నర్ వరుణ్‌ను రంగంలోకి దించి ఫలితాన్ని రాబట్టాడు. మ్యాచ్ మొత్తంలో స్పిన్నర్లతోనే 38 ఓవర్లు వేయించాడు. ఫలితంగా న్యూజిలాండ్ ఇన్నింగ్స్ చాలా మందకొడిగా సాగింది.

### షమీని జట్టులోకి వద్దని..

రోహిత్ తన సహచరులను సంపూర్ణంగా నమ్ముతాడు. వారిపై వచ్చే విమర్శలు పట్టించుకోడు. దీనికితోడు వారు ఫామ్ విషయంలో ఇబ్బందుల్లో ఉంటే తగినన్ని అవకాశాలు ఇచ్చి వారిలో ఆత్మవిశ్వాసం నింపుతాడు. ముఖ్యంగా గిల్ వంటి యువ ఆటగాడు ఫామ్‌లేమితో ఇబ్బందిపడుతున్నా.. అతడి స్థానాన్ని మార్చలేదు. షమీ వంటి సీనియర్ గాయం నుంచి కోలుకొని బోర్డర్ గావస్కర్‌ట్రోఫీ ఆడేందుకు జట్టులోకి రావాలని యత్నించినా.. రోహిత్ అంగీకరించలేదు. అతడు పూర్తిగా కోలుకోకుండా వచ్చి గాయం తిరగబెట్టడం తనకు ఇష్టం లేదని నిర్మొహమాటంగా చెప్పాడు. ఫలితంగా షమీ పూర్తిగా కోలుకొని ఛాంపియన్స్ ట్రోఫీ ఆడి విజేతగా నిలవగలిగాడు. ఇక ఒక సారి వెటరన్ స్పిన్నర్ అశ్విన్ మ్యాచ్ కోసం రాజ్‌కోట్‌లో ఉండగా అతడి తల్లి అనారోగ్యం పాలైంది. ఈ విషయం తెలిసిన రోహిత్ యాష్ కోసం ప్రత్యేక విమానం ఏర్పాటుచేయించి చెన్నై పంపించాడు. అతడికి ధైర్యం చెప్పేందుకు జట్టు ఫిజియో కమలేష్‌ను కూడా వెళ్లమని సూచించాడు. అంతలా జట్టు సభ్యులను చూసుకొనే కెప్టెన్‌ను నేను చూడలేదని అశ్వినే స్వయంగా చెప్పాడు.



## ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్..


### వ్యూస్‌లోనూ రికార్డులు బద్దలు

ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ విజేతగా టీమ్‌ఇండియా నిలిచింది. న్యూజిలాండ్‌తో జరిగిన పోరులో భారత్ విక్టరీ సాధించిన సంగతి తెలిసిందే. అయితే, ఈ ఫైనల్ పోరు రికార్డులను కొల్లగొట్టింది. వ్యూస్ పరంగా అత్యధికమంది చూసిన మ్యాచ్‌గా ఘనత సాధించింది. ఇప్పటివరకు ఐసీసీ ట్రోఫీలకు సంబంధించి ఫైనల్ మ్యాచ్‌లకు వచ్చిన వ్యూస్ కంటే దాదాపు 15 రెట్లు ఈసారి ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌ను వీక్షించడం గమనార్హం. దుబాయ్ వేదికగా జరిగిన ఫైనల్‌కు 90 కోట్లకు పైగా వ్యూస్ వచ్చినట్లు వార్తలు వస్తున్నాయి. ఏకకాలంలో 6.1 కోట్ల మంది చూసినట్లు తెలుస్తోంది. గత వన్డే ప్రపంచకప్ ఫైనల్‌ను 5.9 కోట్ల వ్యూవర్స్ వీక్షించారు. ఇక ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్ - పాకిస్థాన్ మ్యాచ్‌కు 60 కోట్ల వీక్షణలు వచ్చాయి.

## ఐపీఎల్‌లో పొగాకు, మద్యం ప్రకటనలు వద్దు : కేంద్రం

ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో పొగాకు, మద్యం ప్రకటనలను నిషేధించాలని కేంద్రం ఆదేశించింది. ఈమేరకు ఐపీఎల్ ఛైర్మన్ అరుణ్ ధుమాల్‌కు కేంద్ర ఆరోగ్యశాఖ లేఖ రాసింది. మార్చి 22 నుంచి ఈ లీగ్ ప్రారంభం కానున్న సంగతి తెలిసిందే. "భారత యువతకు ఆదర్శంగా ఉండే క్రికెట్ ఆటగాళ్లకు ఏ రకమైన పొగాకు లేక మద్యం ప్రకటనలతో సంబంధం ఉండకూడదు. ఐపీఎల్, సంబంధిత కార్యక్రమాలు జరిగే స్టేడియం ప్రాంగణాలు, జాతీయ మీడియాలో ప్రసారమయ్యే సెషన్‌ల సమయంలో పొగాకు, మద్యం ప్రకటనలు ఇవ్వొద్దు. అమ్మకాలపై కూడా నిషేధం ఉంది. ఈ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలి" అని కేంద్రం ఆదేశించింది. మార్చి 22 నుంచి మే 25 వరకు ఐపీఎల్ 2025 సీజన్ అలరించనుంది. మొత్తం 74 మ్యాచులు 65 రోజులపాటు జరుగుతాయి. తొలి మ్యాచ్ మార్చి 22న డిఫెండింగ్ ఛాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్ - రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్ల మధ్య ఈడెన్ గార్డెన్స్ వేదికగా ప్రారంభం కానుంది. మార్చి 23న ఉప్పల్ వేదికగా హైదరాబాద్ - రాజస్థాన్ జట్ల మధ్య పోరు ఉండనుంది. ఈ సమయంలో క్రికెట్ అభిమానులు టీవీలు, మొబైళ్లను వదలరు. దాంతో ఐపీఎల్‌పై అడ్వర్టైజర్లు ఎక్కువ దృష్టిపెడుతుంటారు. ఈనేపథ్యంలోనే కేంద్రం నుంచి స్పందన వచ్చింది. "ప్రతి ఏడాది భారత్‌లో సంభవిస్తోన్న 70 శాతం మరణాలకు దీర్ఘకాలిక వ్యాధులైన క్యాన్సర్, ఊపిరితిత్తుల సంబధిత వ్యాధులు, హైపర్‌టెన్షన్, మధుమేహం కారణమవుతున్నాయి. పొగాకు, ఆల్కహాల్ వాడకం ఈ దీర్ఘకాలిక వ్యాధులకు దారితీస్తున్నాయి. పొగాకు సంబంధిత మరణాల్లో భారత్ రెండో స్థానంలో ఉంది" అని కేంద్రం పేర్కొంది.

## 'ఎక్స్' సేవలకు ప్రపంచవ్యాప్తంగా అంతరాయం



ప్రముఖ మైక్రో బ్లాగింగ్ సైట్ 'ఎక్స్ (గతంలో ట్విటర్)' సేవలకు కాసేపు అంతరాయం ఏర్పడింది. భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో సోమవారం మధ్యాహ్నం ఈ సమస్య తలెత్తింది. 'ఎక్స్' ఖాతాలను తెరవగానే ఖాళీ పేజీ దర్శనమిస్తోందని పలువురు యూజర్లు ఇతర సామాజిక మాధ్యమాల వేదికగా ఫిర్యాదులు చేశారు. డౌన్‌డిటెక్టర్ పోర్టల్ ప్రకారం.. భారత్‌లో దాదాపు 2 వేలకు పైగా ఫిర్యాదులు వచ్చినట్లు తెలుస్తోంది. అమెరికాలో 18 వేల మంది, యూకేలో 10వేల మంది 'ఎక్స్' సేవలు రావట్లేదని పోస్టులు చేసినట్లు సమాచారం. అమెరికాలో దాదాపు 57 శాతం మందికి ఈ సమస్య ఎదురైనట్లు పలు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. దీనిపై కంపెనీ స్పందించలేదు. సిబ్బంది కొరత, ఇతర సాంకేతిక కారణాల వల్ల తరచూ ఆ మధ్య 'ఎక్స్' సేవలు తరచూ నిలిచిపోయిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఎక్స్ సేవలు తిరిగి అందుబాటులోకి వచ్చాయి.



## ఏసీల ధరలు 4-5% పెరిగే అవకాశం

దేశవ్యాప్తంగా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో, ఎయిర్ కండీషనర్ల (ఏసీ)కు గిరాకీ గణనీయంగా పెరుగుతుందని కంపెనీలు అంచనా వేస్తున్నాయి. వేసవి ఎండలు ముదిరే కొద్దీ, రాబోయే రోజుల్లో అమ్మకాలు 25-30% పెరుగుతాయనే భావనతో కంపెనీలు ఏసీలను తయారీని పెంచుతున్నాయి. ఇందుకు తగ్గట్లుగా విడిభాగాలు సరఫరా కావడంలేదు. ఫలితంగా ధరలు అధికమవుతున్నాయి. మొత్తంమీద ఏసీ తయారీ వ్యయం పెరిగి, వీటి ధరలను కంపెనీలు 4-5% పెంచొచ్చనే అభిప్రాయాలు వెలువడుతున్నాయి. కొనుగోలుదారుకు వచ్చేసరికి ఈ భారం రూ.1500-2000 వరకు ఉండొచ్చని చెబుతున్నారు.

# నష్టాల్లో ముగిసిన సూచీలు

## 22,500 దిగువకు నిఫ్టీ




**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. ఉదయం లాభాల్లో కదలాడిన సూచీలు మధ్యాహ్నం తర్వాత నష్టాల్లోకి జారుకున్నాయి. అమెరికా ఫ్యూచర్స్ నుంచి వచ్చిన ప్రతికూల సంకేతాలతో మదుపర్లు ఆఖర్లో అమ్మకాలకు దిగారు. దీంతో ఇంట్రాడే గరిష్ఠాల నుంచి సెన్సెక్స్ 700 పాయింట్ల మేర పతనం కాగా.. నిఫ్టీ 22,500 దిగువకు చేరింది. ఇన్ఫోసిస్, హిందుస్థాన్ యూనిలీవర్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ షేర్లు సూచీలకు దన్నుగా నిలవగా.. ఎల్‌అండ్‌టీ, రిలయన్స్ ఇండస్ట్రీస్ సూచీలను దిగువకు లాగాయి. మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ షేర్లలోనూ అమ్మకాల ఒత్తిడి కనిపించింది. సెన్సెక్స్ ఉదయం 74,474.98 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 74,332.58) లాభాల్లో ప్రారంభమైంది. ఉదయమంతా లాభాల్లో కదలాడింది. ఇంట్రాడేలో 74,741.25 వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. మధ్యాహ్నం తర్వాత నష్టాల్లోకి జారుకుంది. ఇంట్రాడేలో 74,022.24 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 217.41 పాయింట్ల నష్టంతో 74,115.17 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 77.55 పాయింట్ల నష్టంతో 22,474.95 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 38 క్షీణించి 87.33గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఇండస్ ఇండ్ బ్యాంక్, జొమాటో, ఎల్‌అండ్‌టీ, టైటాన్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు నష్టాల్లో ముగిశాయి. పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, హిందుస్థాన్ యూనిలీవర్, ఇన్ఫోసిస్, నెస్లే ఇండియా, ఏషియన్ పెయింట్స్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయంగా బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 70.51 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 2914 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

## 100 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్ ప్రారంభం



ప్రముఖ పునరుత్పాదక ఇంధన సంస్థ 'జునిపర్ గ్రీన్ ఎనర్జీ'..భూటాన్‌కు విద్యుత్ సరఫరా చేయడానికి రాజస్థాన్‌లో 100 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టును ప్రారంభించినట్లు ఈ రోజు(సోమవారం) ప్రకటించింది. శీతాకాలం భూటాన్‌కు సరఫరా అయ్యే విద్యుత్‌లో 50 శాతం అందించే లక్ష్యంతో ఈ ప్రాజెక్టు పనిచేస్తుందని జునిపర్ ఒక ప్రకటనలో తెలిపింది. జునిపర్ గ్రీన్ ఎనర్జీ..సౌర, పవన, హైబ్రిడ్ ప్రాజెక్టుల్లో ప్రత్యేకత కలిగిన స్వతంత్ర పునరుత్పాదక ఇంధన విద్యుత్ ఉత్పత్తి సంస్థ. ఇది సింగపూర్‌కు చెందిన ఏటీ గ్రూప్‌లో భాగం. జునిపర్ గ్రీన్ ఎనర్జీ..పునరుత్పాదక ఇంధనం, నివాస, వాణిజ్య స్థిరాస్తి, హాస్పిటాలిటీలో ప్రపంచ స్థాయి పెట్టుబడులను కలిగి ఉంది. ఈ సంస్థను 2018, అక్టోబర్‌లో స్థాపించారు.




## ఎస్ఎంఈ ఐపీఓ నిబంధనలు కఠినతరం

### ఆఫర్ ఫర్ సేల్ 20 శాతమే

స్టాక్ మార్కెట్‌లో నిధుల సమీకరణ కోసం క్యూకడుతున్న స్మాల్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ ఐపీఓలకు చెక్ పెట్టేందుకు మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ నడుం బిగించింది. పబ్లిక్ ఇష్యూకు వచ్చేందుకు కొన్ని నిబంధనలను నిర్దేశించింది. లాభదాయకత, 20 శాతానికి మించని ఆఫర్ ఫర్ సేల్ వంటి పరిమితులను పెట్టింది. రిటైల్ ఇన్వెస్టర్ల ప్రయోజనాలను కాపాడే ఉద్దేశంతో సెబీ ఈ నిబంధనలను తీసుకొచ్చింది. ఇటీవల కాలంలో ఎస్ఎంఈ ఐపీఓల్లో పెట్టుబడులకు ఇన్వెస్టర్లు ఉత్సుకత చూపిస్తున్న వేళ సెబీ ఈ నిబంధనలను కట్టుదిట్టం చేస్తూ తాజాగా ఓ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎస్ఎంఈ విభాగంలో ఏదైనా కంపెనీ ఐపీఓకు రావాలంటే గడిచిన మూడేళ్లలో కనీసం రెండేళ్ల పాటు రూ.1 కోటి నిర్వహణ లాభాలను సాధించి ఉండాలి. ఈ ఐపీఓల్లో ఆఫర్ ఫర్ సేల్ ద్వారా షేర్ హోల్డర్లు 20 శాతానికి మించి వాటాను విక్రయించడానికి వీల్లేదు. ప్రస్తుత వాటాదారులెవరూ 50 శాతానికి మించి వాటాను విక్రయించడానికి అవకాశం లేదు. కనీస వాటా పరిమితికి మించి అదనంగా ఉన్న షేర్ హోల్డింగ్‌కు లాక్-ఇన్ వ్యవధి ఉంటుంది. ఏడాది తర్వాత అదనంగా ఉన్న వాటాబీ రెండేళ్ల తర్వాత మిగిలిన 50 శాతం వాటా వదులుకోవడానికి వీలవుతుంది. నాన్ ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్లకు షేర్ల అలకేషన్‌కు సంబంధించి మెయిన్ బోర్డు ఐపీఓ నిబంధనలే ఎస్ఎంఈ ఐపీఓలకూ వర్తిస్తాయి. ఎస్ఎంఈ ఐపీఓల సబ్‌స్క్రిప్షన్‌కు కనీసం రెండు లాట్లు కొనగోలు చేయాల్సి ఉంటుంది. పబ్లిక్ ఇష్యూ ద్వారా సమీకరించిన నిధులను సాధారణ కార్పొరేట్ అవసరాలు పేరు చెప్పి ఎడాపెడా వినియోగించుకోవడానికి లేదు. మొత్తం నిధుల్లో 15 శాతం లేదా రూ.10 కోట్లు మాత్రమే (ఏది తక్కువైతే అది) గరిష్ఠంగా వినియోగించుకోవడానికి వీలుంది. ప్రమోటర్లు, ప్రమోటర్ గ్రూప్స్, సంబంధిత పార్టీలు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా తీసుకున్న రుణాలకు ఐపీఓ ద్వారా సమీకరించిన నిధులను వినియోగించడానికి వీల్లేదు.



## సినిమాలో అవకాశాలు తగ్గాయి

### యాడ్స్‌తోనే సంపాదిస్తున్నా : ప్రకాష్‌వారియర్

నటనపై ఆసక్తితో సినీరంగంలోకి అడుగుపెట్టింది. షార్ట్ ఫిల్మ్స్ ద్వారా ఫేమస్ అయ్యింది.తర్వాత సినీరంగంలోకి నటిగా ఎంట్రీ ఇచ్చింది. కథానాయికగా ఆమె నటించిన ఫస్ట్ మూవీ సంచలన విజయం సాధించింది. ముఖ్యంగా అందులో ఆమె కనిపించిన సీన్స్ సోషల్ మీడియాలో ఓ రేంజ్ లో దూసుకుపోయాయి. కట్ చేస్తే.. స్టార్ హీరోయిన్‌గా క్రేజ్ సొంతం చేసుకుంది. కానీ అం దం, అభినయం కట్టిపడేసిన ఈ బ్యూటీకి అదృష్టం మాత్రం కలిసిరావడం లేదు. ఆమె నటించిన చిత్రాలు డిజాస్టర్స్ కావడంతో నెమ్మదిగా అవకాశాలు తగ్గిపోయాయి. కానీ సోషల్ మీడియాలో గ్లామర్ ఫోజులతో మెంటలెక్కిస్తోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆ బ్యూటీ మాట్లాడుతూ.. తనకు ఎవరూ అవకాశాలు ఇవ్వడం లేదని.. కానీ తాను మాత్రం సోషల్ మీడియా పేజీల ద్వారా ఆదాయం సంపాదిస్తున్నానని తెలిపింది హీరోయిన్ ప్రియా ప్రకాష్ వారియర్. ఒకే ఒక్క సినిమాతో మలయాళీ ప్రేక్షకుల హృదయాలను దోచుకున్న నటి ప్రియా ప్రకాష్ వారియర్. ఒమర్ లులు దర్శకత్వం వహించిన ఒరు అదార్ లవ్ చిత్రంలోని ఒక పాటలో కన్నుగీటుతూ కనిపించి ఒక్కసారిగా ఫేమస్ అయ్యింది. ఆ తర్వాత నెట్టింట తెగ ట్రెండ్ అయ్యింది. అలాగే మలయాళంలో వరుస ఆఫర్స్ అందుకుంది. ఒక్క రోజులోనే లక్షలాది మంది ఆ నటిని ఇన్‌స్టాగ్రామ్‌లో ఫాలో అయ్యారు. ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ప్రకటనలు, ప్రమోషన్ ద్వారా దృష్టిని ఆకర్షించింది. దీనివల్ల స్టార్‌కు మంచి ఆదాయం వచ్చింది. ఈ విషయాన్ని ఆ స్టార్ స్వయంగా బహిరంగంగా చెప్పడంతో ఇప్పుడు అది సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సినిమా లేకపోయినా బ్రాండ్ల నుండి ప్రకటనలు వస్తున్నందుకు ఉపశమనం కలిగిస్తోందని తెలిపింది. కానీ తన లక్ష్యం మాత్రం సినిమాల్లో నటించడమే అని తెలిపింది.



## నందినీరెడ్డితో మరోసారి సమంత

స్టార్ హీరోయిన్ సమంత, లేడీ డైరెక్టర్ నందిని రెడ్డి ది హిట్ కాంబినేషన్. కృష్ణవంశీతో పాటు పలువురి దగ్గర దర్శకత్వ శాఖలో పనిచేసిన నందినీ రెడ్డి ఆ తర్వాత దర్శకురాలిగా మారి పలు విజయవంతమైన చిత్రాలను రూపొందించారు. 'అలా మొదలైంది'తో దర్శకురాలిగా కెరీర్ ప్రారంభించిన నందినీ రెడ్డి స్టార్స్ వెనక పడుకుండా, కథకు ప్రాధాన్యమిచ్చి సినిమాలు చేస్తూ ముందుకు సాగుతున్నారు. సిద్ధార్థ్, సమంత జంటగా గతంలో 'జబర్ దస్త్' మూవీని తెరకెక్కించారు నందినీరెడ్డి. ఆ సినిమా పెద్దంతగా ఆడలేదు. అయితే ఆ తర్వాత వచ్చిన 'ఓ బేబీ' ఘన విజయం సాధించింది. అంతేకాదు... నటీమణులు లక్ష్మీ, సమంతలకు, నాగశౌర్య, తేజ సజ్జా, రావు రమేశ్‌లకు మంచి పేరునూ తెచ్చిపెట్టింది. ఇప్పుడు మరోసారి సమంత నాయికగా తానో సినిమా చేయబోతున్నానని నందినీ రెడ్డి తెలిపింది. నాగచైతన్య నుండి విడిపోయిన తర్వాత కొంతకాలం ఆరోగ్యంపై దృష్టిపెట్టిన సమంత నిదానంగా కోలుకుంది. వెబ్ సిరీస్ లతో జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకుంటూనే సొంత నిర్మాణ సంస్థనూ స్థాపించింది. తన సొంతబ్యానర్ లో 'మా ఇంటి బంగారం' అనే సినిమాను సమంత నిర్మిస్తోంది. ఇవాళ మహిళలకు చిత్రసీమలో తగిన ప్రాధాన్యం లేదనేది వాస్తవం. అలానే వేతనాల విషయంలోనూ ఎంతో వ్యత్యాసం ఉంది. ఇలాంటి వాటికి తావు ఇవ్వకుండా సమంత తన సొంత చిత్రంలో అందరికీ సమానవేతం, గౌరవం అందిస్తోందని నందినీ రెడ్డి తెలిపింది. ఈ సినిమా తర్వాత తాను సమంతతో ఓ సినిమా చేయబోతున్నానని వెల్లడించింది. అయితే అది సమంత ఓన్ బ్యానర్ లో ఉంటుందా? లేకపోతే... వేరే నిర్మాణ సంస్థ వీరితో మూవీ చేస్తుందా? అనేది తెలియాల్సి ఉంది.



## 'రాజాసాబ్'లో నాది ఆ పాత్ర కాదు..

## క్లారిటీ ఇచ్చిన నిధి అగర్వాల్

ఇద్దరు అగ్ర హీరోల సినిమాల్లో నటిస్తూ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు నటి నిధి అగర్వాల్. టాలీవు డ్ స్టార్ హీరోలు పవన్ కల్యాణ్, ప్రభాస్‌ల సరసన భారీ ప్రాజెక్ట్‌లతో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. తాజాగా ఆమె ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో 'రాజాసాబ్'లో తన పాత్ర గురించి వివరించారు. అలాగే పవన్‌తో కలిసి నటించడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. "ఇండస్ట్రీకి రావడం కోసమే మోడలిం గ్ రంగంలోకి వెళ్లాను. సినీ నేపథ్యం లేకపోవడంతో మోడలింగ్ ద్వారా ఇండస్ట్రీకి వచ్చాను. ప్రస్తుతం టాలీవుడ్‌లో చేస్తోన్న రెండూ భారీ ప్రాజెక్ట్‌లే. పవన్ కల్యాణ్ 'హరి హర వీరమల్లు' పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా రానుంది. ఈ సినిమా కోసం నేను రెండున్నర నెలలు గుర్రపుస్వారీ నేర్చుకున్నా ను. భరతనాట్యం, కథక్‌లోనూ శిక్షణ తీసుకున్నాను. పవన్‌తో కలిసి నటించడం ఎప్పటికీ మర్చి పోలేని అనుభవం. ఆయన గొప్ప మేధావి. సాహిత్యంపై పట్టు ఉంది. ఆయన ధైర్యాన్ని అభినం దించాలి. డిప్యూటీ సీఎం కాకముందు నుంచే ఈ సినిమా షూటింగ్ ప్రారంభమైంది. ఆ తర్వా త ఆయన ఎన్నికల సమయంలో బిజీగా ఉండడంతో కొన్ని రోజులు చిత్రీకరణ వాయిదా వేశాం. డిప్యూటీ సీఎం అయ్యాక మళ్లీ షూటింగ్‌లో పాల్గొన్నారు. అప్పటికీ, ఇప్పటికీ అలానే ఉన్నారు. కొంచెం కూడా మార్పులేదు" అన్నారు. ఇక ప్రభాస్ 'రాజా సాబ్' గురించి మాట్లాడుతూ.. "హారర్ కామెడీ నేపథ్యంలో రానున్న ఈ చిత్రంలో నేను దెయ్యం పాత్ర పోషించడం లేదని స్పష్టం చేస్తున్నాను. వినోదాత్మకంగా సాగే ఈ సినిమాలో నా పాత్ర అందరినీ ఆశ్చర్యపరిచేలా ఉంటుంది. ప్రభాస్ ఎప్పుడూ నవ్విస్తూ ఉంటారు. సెట్‌లో అందరితో సరదాగా ఉ ంటారు" అని చెప్పారు.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com